

అభివృద్ధి, ప్రజా సంక్షేమమే మా ప్రభుత్వ లక్ష్యం. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి చేరేలా "ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. ప్రజల సమస్యలు, సూచనలు తెలుసుకుని అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటూ, ప్రజలతో ప్రత్యక్ష అనుబంధాన్ని మరింత బలోపేతం చేస్తున్నాం.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్,** ఎమ్మెల్సీ


సోమవారం 24.08.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 124 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# అంతరిక్షమే.. భారత్ కొత్త గమ్యం



- భారత అంతరిక్ష రంగంలో కొత్త శకానికి ప్రధాని మోదీ పిలుపు
- ప్రపంచ ప్రతిభను ఆకర్షించేలా వ్యవస్థను తీర్చిదిద్దాలని సూచన

**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ఫైల్) :** భారత అంతరిక్ష రంగంలో అద్భుతాలు సృష్టించే సమయం ఆసన్నమైందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతిభావంతులను అయస్కాంతంలా భారత అంతరిక్ష రంగం వైపు ఆకర్షించేలా ప్రత్యేక వాతావరణం నెలకొల్పాలని పిలుపునిచ్చారు. కొత్త ఆలోచనలతో, సాంకేతికతతో ముందుకు వచ్చే స్టార్టప్‌లకు ప్రభుత్వం అండగా ఉంటుందని, రిస్క్ తీసుకునే పారిశ్రామికవేత్తలకు స్థిరమైన, విశ్వసనీయ విధానాల ద్వారా భరోసా కల్పిస్తామని స్పష్టం చేశారు. జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా భారత అంతరిక్ష రంగానికి చెందిన స్టార్టప్‌ల సీఈఓలు, వ్యవస్థాపకులతో ప్రధానమంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జరిగిన చర్చకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో పంచుకున్న ఆయన.. యువ పారిశ్రామికవేత్తల శక్తి, ఆశయాలు తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని పేర్కొన్నారు. భారత అంతరిక్ష ప్రయాణంపై వారి ఆలోచనలు, భవిష్యత్‌పై వారి దృక్పథం దేశానికి స్ఫూర్తిదాయకమని అన్నారు.

**నిలకడైన విధానాలే పెట్టుబడులకు భరోసా :** ప్రపంచంలోని ప్రతిభావంతులు అంతరిక్ష రంగంలో తమ

మిగతా 2లో...

# ఇంటింటికీ టీడీపీ..
## జనంతో మమేకం!



- 28 రోజుల్లో 79.39 లక్షల ఇళ్ల సందర్శన
- రెండేళ్ల పాలనపై ప్రజల స్పందన తెలుసుకుంటున్న పార్టీ శ్రేణులు
- గడపగడపకు అభివృద్ధి, సంక్షేమ సందేశం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు.. ప్రభుత్వ పనితీరుపై ప్రజల స్పందనను నేరుగా తెలుసుకునేందుకు తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న "ఇంటింటికీ తెలుగుదేశం – 2 ఏళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమం 28వ రోజూ రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా కొనసాగింది.

**75 లక్షల ఇళ్ల మైలురాయిని దాటి.. 79.39 లక్షల ఇళ్లకు చేరుకున్న 'ఇంటింటికీ తెలుగుదేశం'**

28వ రోజు రాష్ట్రవ్యాప్తంగా 2,51,872 ఇళ్లను టీడీపీ నాయకులు, కార్యకర్తలు సందర్శించారు. దీంతో కార్యక్రమం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు మొత్తం 79.39 లక్షల ఇళ్లను పార్టీ శ్రేణులు సందర్శించారు. ఇప్పటికే 75 లక్షల ఇళ్ల మైలురాయిని అధిగమించి, ప్రజల గడపగడపకు 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం మరింత వేగంగా విస్తరిస్తోంది. ప్రతీ గడపకు వెళ్లి ప్రతీ కుటుంబాన్ని ప్రత్యక్షంగా కలిసి వారికి అందుతున్న ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను వివరిస్తూ.. రైతులు, మహిళలు, యువత, పేదలు, మధ్య తరగతి వర్గాలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఆయా కుటుంబాలకు తెలియజేస్తున్నారు. అదే సమయంలో ప్రజల సమస్యలు, అభిప్రాయాలను నేరుగా తెలుసుకుంటూ మిగతా 2లో...

## నేడు ఏలూరు జిల్లాలో సీఎం పర్యటన



- ఉపరాష్ట్రపతితో కలిసి మొక్కజొన్న కొత్త వంగడాన్ని ఆవిష్కరించనున్న సీఎం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రైతుల పంటకు విలువ జోడించి, ప్రాసెసింగ్, బ్రాండింగ్‌తో మార్కెట్‌కు తరలించడం ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే ప్రయోగానికి ఏలూరు జిల్లా ముసునూరు వేదిక కానుంది. దేశంలో తొలి నాన్–జీఎంఓ పాప్‌కార్న్ మెయిజ్ హైబ్రిడ్ విత్తనాన్ని ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ముఖ్యమంత్రి చంద్రబాబు సంయుక్తంగా ఆవిష్కరించనున్నారు. ఏలూరు జిల్లా జిల్లా ముసునూరులో గోర్మే పాప్ కార్నికా సంస్థ ఆధ్వర్యంలో జన్యు పరంగా మార్పు చెందని మొక్కజొన్న వంగడాన్ని ఇరువురు నేతలు ఆవిష్కరించనున్నారు. గోర్మే పాప్‌కార్నికా ప్రస్తుతం దేశవ్యాప్తంగా వేల ఎకరాల్లో పాప్‌కార్న్ మెయిజ్ సాగుతో వేలాది మంది రైతులతో భాగస్వామ్యం కలిగి ఉంది. ముసునూరులోని ప్లాంట్ ఆసియాలోనే అతిపెద్ద పాప్‌కార్న్ ప్రాసెసింగ్ కేంద్రాల్లో ఒకటిగా నిర్మించారు. దేశంలోని వేలాది సినిమా థియేటర్లకు పాప్‌కార్న్ సరఫరా చేయడంలో సంస్థ కీలకంగా ఉంది. సోమవారం తొలి నాన్GMO పాప్‌కార్న్ మెయిజ్ హైబ్రిడ్ విత్తనాన్ని ఆవిష్కరించనున్నారు.

**ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన వివరాలు:** ఉదయం 09.55 గంటలకు క్యాంప్ కార్యాలయం నుంచి బయలుదేరి 10.15 గంటలకు ముసునూరు మండలం, కాట్రేనిపాడుకు చేరుకుంటారు. 10.45 గంటలకు గవర్నర్ అబ్దుల్ నజీర్ తో కలిసి ఆయన, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ కు స్వాగతం పలుకుతారు. 11.00 గంటలకు హైబ్రిడ్ మొక్కజొన్న విత్తనం ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 01.20 గంటలకు రాష్ట్ర సచివాలయానికి చేరుకుంటారు.

## ఆధ్యాత్మిక ప్రగతి దారులు

- 100కుపైగా ప్రధాన క్షేత్రాలకు గ్రామీణ రోడ్ల అనుసంధానం
- రూ. 120 కోట్లతో 205 కిలోమీటర్ల పొడుగున ప్రధాన ఆలయ అనుసంధాన రోడ్లు
- ఐ.ఎస్.జగన్నాథపురం, అహోబిలం వంటి నరసింహ క్షేత్రాలకు రహదారి కళ
- శ్రీ సత్యసాయి శత జయంతి ఉత్సవాల సందర్భంగా రోడ్ల నిర్మాణానికి రూ. 30 కోట్లు
- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సంకల్పంతో భక్తులకి సౌకర్యం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పలు దేవాలయాలకు సరైన రహదారి సౌకర్యం లేక భక్తులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితిని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువచ్చారు. వాడపల్లి వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాలకు రోజురోజుకూ భక్తుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ, అందుకు అనుగుణంగా రహదారి సౌకర్యాలు మెరుగుపడటం లేదన్న అంశంపై ఆయన ప్రత్యేక దృష్టి సారించారు.

క్షేత్రస్థాయి పర్యటనల్లో అనేక ఆలయాలకు వెళ్లే మార్గాల దుస్థితిని పవన్ కళ్యాణ్ స్వయంగా గుర్తించారు. కొన్ని ఆలయాలకు సంబంధించిన సమస్యలను ప్రజలు వినతిపత్రాల రూపంలో



ఆయన దృష్టికి తీసుకువచ్చారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో దేవాలయాలకు సరైన రహదారులు లేక భక్తులు పడుతున్న ఇబ్బందులను తొలగించాలని నిర్ణయించారు. మిగతా 2లో...

## మద్యం రవాణా కేసులో కారుమూరి అరెస్ట్!

- హైదరాబాద్ కొండాపూర్‌లో మాజీ మంత్రిని అదుపులోకి తీసుకున్న ఈడీ
- రూ.195 కోట్ల మద్యం రవాణా కుంభకోణంలో కీలక పరిణామం
- వైద్య పరీక్షల అనంతరం కోర్టులో హాజరుపరిచే అవకాశం



మిగతా 3లో...

## వెలిగొండ నిర్వాసితుల పునరావాసం, పరిహారం కోసం రూ.518 కోట్లు

- మరో రూ.250 కోట్ల నిధులు మంజూరు చేశాం
- ఈ నెలాఖరు నాటికి నల్లమల సాగర్‌లోకి కృష్ణా జలాలు
- కృష్ణా జలాలకు ప్రజలంతా జలహారతులతో ఘన స్వాగతం పలకాలి



మిగతా 2లో...

## మైనారిటీ ఉద్యోగార్థులకు తీపి కబురు

- పోటీ పరీక్షలకు హాజరయ్యే వారికి ఉచిత శిక్షణ
- సిఈడిఎం ఆధ్వర్యంలో ఆన్ లైన్,ఆఫ్ లైన్ విధానంలో శిక్షణ
- మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్



మిగతా 2లో...

## డిగ్రీ ఒక తలుపు మాత్రమే.. విజయాన్ని నిర్ణయించేది నైపుణ్యం

- గీతం17వ స్నాతకోత్సవంలో విద్యార్థులకు కేంద్ర సహాయ మంత్రి డా. పెమ్మసాని



మిగతా 2లో...

# ఏపీ ఆయుష్ చరిత్రలోనే తొలిసారి...
# మంత్రి సత్యకుమార్ కృషితో ఆయుష్‌కు భారీ ఊతం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మధ్య సమన్వయం రాష్ట్ర ప్రయోజనాలకు ఏ స్థాయిలో దోహదపడుతుందో మరోసారి స్పష్టమైంది. రాష్ట్రవైద్య, ఆరోగ్యశాఖ మంత్రి, బీజేపీ జాతీయ నాయకుడు సత్యకుమార్ కేంద్రంతో సమ న్వయం చేసుకుంటూ ఆయుష్ రంగానికి నిధులు సాధించేందుకు చేసిన ప్రయ త్నాలు ఒక్కొక్కటిగా ఫలిస్తున్నాయి. ఇటీవలే... గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలంలో రూ. 100 కోట్ల తో సెంట్రల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఫర్ యోగ అండ్ నేచురోపతి 100 పడకల రీసెర్చ్ హాస్పిటల్ ఏర్పాటు చేస్తామని కేంద్రం ప్రకటించింది. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం సమర్పించిన 2026-27 రాష్ట్ర వార్షిక కార్యాచరణ ప్రణాళికకు కేంద్ర ఆయుష్ మిషన్ డైరెక్టరేట్ రూ. 185.75 కోట్లకు ఆమోదం తెలిపింది. 2014లో జాతీయ ఆయుష్ మిషన్ ప్రారంభమైన తర్వాత రాష్ట్రానికి లభించిన అత్యధిక వార్షిక కేటాయింపులు ఇవే కావడం విశేషం. గిరిజన, మారుమూల ప్రాంతాల ప్రజలకు ఆయుష్ వైద్య సేవలను మరింత చేరువ చేసేందుకు 9 ఐటీడీఏల పరిధిలో 19 మొబైల్ మెడికల్ యూనిట్లను సేవల్లోకి తీసుకురావడం ఈ ప్రణాళికలో హైలెట్.

**గత వైకాపా పాలనలో మూడేళ్లు నిల్..:** గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో 2021-22, 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాల్లో వరుసగా మూడు సంవత్సరాలు జాతీయ ఆయుష్ మిషన్ కింద రాష్ట్రానికి బడ్జెట్ కేటాయింపులు, నిధుల విడుదల జరగలేదు. దీంతో ఆయుష్ రంగం అభివృద్ధికి ఆటంకం ఏర్పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి మారింది.

**4 రెట్లుకు పైగానే అధికం:** నేషనల్ ఆయుష్ మిషన్ కింద నిధుల కేటాయింపులో గణనీయమైన పెరుగుదల నమోదైంది. 2014 నుండి 2024 వరకు పదేళ్ల కాలంలో మొత్తం రూ. 120.17 కోట్లు మంజూరు చేయగా, 2024 నుండి 2027 వరకు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన కేవలం మూడేళ్ల కాలానికే రూ. 434.64 కోట్ల నిధుల కేటాయింపులకు కేంద్ర ఆమోదం తెలిపింది. ఇది పాత కేటాయింపులతో పోలిస్తే నాలుగు రెట్లకు పైగా పెరగడం ఆయుష్ వైద్య విధానాల పట్ల పెరుగుతున్న ప్రాధాన్యతను తెలియజేస్తోంది. 2024-25లో రూ. 83.23 కోట్లు, 2025-26లో రూ. 165.66 కోట్లు ఆమోదం పొందగా ప్రస్తుత 2026-27లో ఏకంగా మిగతా 2లో...

- రూ.185.75 కోట్లతో వార్షిక ప్రణాళికకు కేంద్రం ఆమోదం
- 2024-25 నుంచి 26-27 వరకు కలిపి రూ. 434 కోట్ల కేటాయింపులకు ఆమోదం
- 2014-15 నుంచి 2023-24 వరకు రూ.120 కోట్లు కేటాయింపు
- తాజా కేటాయింపుల్లో ఐటీడీఏ ప్రాంతాల్లో 19 మొబైల్ మెడికల్ యూనిట్లు..
- డిస్పెన్సరీల ఆధునికీకరణ, ఆల్కహాల్ డీ-అడిక్షన్ కేంద్రాలు, యోగా వెల్నెస్ కేంద్రాలు, ఇతర వాటికి నిధుల ఆమోదం
- కేంద్రానికి కూటమి ప్రభుత్వం తరపున మంత్రి సత్యకుమార్ కృతజ్ఞతలు
- సీఎం చంద్రబాబు విజన్‌తో వైద్యరంగంలో అభివృద్ధి

## ఇంటింటికీ టీడీపీ.. జనంతో మమేకం!

(మొదటి పేజీ తరువాయి)

వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారు.
రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుండటంతో 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం మరింత ఉత్సాహంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలు కూడా పెద్దఎత్తున భాగస్వామ్యమవుతున్నారు.

## మైనారిటీ ఉద్యోగార్థులకు తీపి కబురు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగాల జాతర జాబ్ క్యాలెండర్ -2026 ను కూటమి ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో మైనారిటీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మైనారిటీ అభ్యర్థులకు మరో తీపి కబురు ప్రకటించింది. జాబ్ క్యాలెండర్ లో భర్తీ చేయనున్న10,060 పోస్టుల భర్తీకి నిర్వహించే పోటీ పరీక్షలకు హాజరయ్యే మైనారిటీ అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు నిర్ణయించినట్లు మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ ప్రకటించారు. పోటీ పరీక్షలకు హాజరయ్యే వారికి ఉచిత శిక్షణను సిఈడిఎం (సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనారిటీస్) ఆధ్వర్యం లో ఆన్ లైన్,ఆఫ్ లైన్ విధానంలో శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆదివారం అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి ఫరూక్ వెల్లడించారు. నాలుగు విడతల్లో పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ల జారీ షెడ్యూల్ ను కూటమి ప్రభుత్వం విడుదల చేసిన విషయం ను మంత్రి గుర్తు చేశారు. ఎన్నికలకు ముందు ఎన్డీఏ కూటమి ఇచ్చిన హామీని తూచా తప్పకుండా అమలు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నదని అన్నారు. గత ఏడాది ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వం లోని కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా డీ ఎస్ సీ నిర్వహించి 16 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడం జరిగిందన్నారు. అందులో 1650 మంది మైనారిటీ అభ్యర్థులు విజయ ఢంకా మోగించి ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందినట్లు మంత్రి తెలిపారు. ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని ఇచ్చిన హామీకి అనుగుణంగా జాబ్ క్యాలెండర్ -2026 ను కూటమి ప్రభుత్వం ప్రకటించడం పట్ల నిరుద్యోగ యువతలో ప్రభుత్వ ఉద్యోగాలను సాధించాలన్న తపన, కసి పెరిగాయన్నారు. పోటీ పరీక్షలను ప్రతిష్టాత్మకంగా అభ్యర్థులందరూ భావించి పోటీ పడనున్న నేపథ్యంలో మైనారిటీ విద్యార్థులకు మేలు చేకూర్చేలా సిఈడిఎం ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణ ఇవ్వాలని మైనారిటీ మంత్రిత్వ శాఖ నిర్ణయించిందని పేర్కొన్నారు. మైనారిటీ అభ్యర్థుల్లో అత్యధిక శాతం పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారు ఉన్నారని, ఉద్యోగాల జాతరలో కొలువులు సాధించేందుకు ఉచిత శిక్షణ మైనారిటీ అభ్యర్థులకు అండగా నిలుస్తుందని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. గ్రూప్-1, గ్రూప్ -2, వివిధ శాఖల్లో ఇంజనీరింగ్ పోస్టులు, ఉపాధ్యాయ, పోలీసు, సంక్షేమ శాఖలోని ఖాళీలు, తదితర పోస్టుల భర్తీకి నిర్వహించే పరీక్షలకు మైనారిటీ అభ్యర్థులు సంసిద్ధం కావాలని మంత్రి సూచించారు. సిఈడిఎం ఆధ్వర్యంలో ఉద్యోగార్థులకు నిర్వహించబోయే ఉచిత శిక్షణకు సంబంధించిన కార్యాచరణ షెడ్యూల్ ను నోటిఫికేషన్ల జారీ అనంతరం వెల్లడి చేయడం జరుగుతుందని తెలిపారు. ఆన్ లైన్ విధానం తో పాటు ఆఫ్ లైన్ కూడా ఉచిత శిక్షణ ఇచ్చే ఏర్పాట్లను మైనారిటీ మంత్రిత్వ శాఖ పకడ్బందీగా నిర్వహిస్తుందని,మైనారిటీ ఉద్యోగార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పిలుపునిచ్చారు.

## వెలిగొండ నిర్వాసితుల పునరావాసం, పరిహారం కోసం రూ.518 కోట్లు

- మరో రూ.250 కోట్ల నిధులు మంజూరు చేశాం
- ఈ నెలాఖరు నాటికి నల్లమల సాగర్‌లోకి కృష్ణా జలాలు
- కృష్ణా జలాలకు ప్రజలంతా జలహారతులతో ఘన స్వాగతం పలకాలి
- మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే వెలిగొండ పనులను పూర్తి చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. శనివారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో మంత్రి మాట్లాడుతూ...వెలిగొండ ప్రాజెక్ట్ నిర్వాసితుల పునరావాసం, పరిహారం కోసం ఇప్పటికే రూ.518 కోట్లు విడుదల చేశాం. నేడు మరో రూ. 250 కోట్ల నిధులు మంజూరు చేశాం. నిర్వాసితుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు సాగుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే వెలిగొండ పనులను పూర్తి చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదే. ఈ నెలాఖరు నాటికి నల్లమల సాగర్‌లోకి కృష్ణా జలాల తరలిస్తాం. వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తితో పశ్చిమ ప్రకాశం ప్రాంత ప్రజల తాగు, సాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. 1996లో వెలిగొండ ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన చేసిన నారా చంద్రబాబు నాయుడే నేడు ముఖ్యమంత్రిగా ప్రాజెక్ట్‌ను ప్రారంభించడం చారిత్రాత్మక ఘట్టం. పశ్చిమ ప్రాంత ప్రజల చిరకాల స్వప్నమైన వెలిగొండ కృష్ణా జలాలను ఈ నెలాఖరులో విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధం. కృష్ణా జలాలకు ప్రజలంతా జలహారతులతో ఘన స్వాగతం పలకాలి. వెలిగొండ పూర్తితో ప్రకాశం పశ్చిమ ప్రాంతంలో వ్యవసాయం, తాగునీరు, ఆర్థికాభివృద్ధికి కొత్త ఊపిరి అని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు.

# ఏపీ ఆయుష్ చరిత్రలోనే తొలిసారి...
# మంత్రి సత్యకుమార్ కృషితో ఆయుష్‌కు భారీ ఊతం

(మొదటి పేజీ తరువాయి)

రూ. 185.75 కోట్ల ఆమోదం లభించింది.
**వార్షిక ప్రణాళిక-ముఖ్యాంశాలు :**
**డిజిటల్ ఆయుష్ :** ఆయుష్ సేవలను డిజిటల్ విధానంలోకి తీసుకెళ్లేందుకు నిధులు కేటాయించారు. 601 ఆయుష్ డిస్పెన్సరీల్లో డిజిటలైజేషన్, ఇంటర్నెట్ కనెక్షన్ల కోసం రూ. 50 లక్షలు, 157 మంది ఆయుష్ వైద్యాధికారులకు ల్యాప్‌టాప్‌ల కోసం రూ. 62.80 లక్షలు ఆమోదించారు. 126 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలకు బీ.ఎస్.ఎన్.ఎల్ ల్యాండ్లైన్, ఇంటర్నెట్ కనెక్టివిటీ కోసం కూడా నిధులు కేటాయించారు.
**క్రీడాకారులకు సంప్రదాయ చికిత్సలతో రికవరీకి ప్రత్యేక కేంద్రం:** కడపలో నూతనంగా ఏర్పాటు చేయనున్న ఆయుష్ స్పోర్ట్స్ మెడిసిన్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ క్రీడాకారులకు సంప్రదాయ చికిత్సల ద్వారా గాయాల నుండి వేగంగా కోలుకోవడానికి, రసాయనాలు లేని పద్ధతుల్లో వారి శారీరక సామర్థ్యాన్ని పెంపొందించడానికి దోహదపడుతుంది.
**ఆల్కహాల్ డీ-అడిక్షన్ కేంద్రాలు:** రాష్ట్రంలోని 04 ఆయుష్ బోధనాస్పత్రుల్లో మద్యం వ్యసనపరులకు మానసిక ప్రశాంతతను అందిస్తూ వారిని వ్యసనాల నుండి విముక్తులను చేసి, కుటుంబాల్లో వెలుగులు నింపుతాయి.
రాష్ట్రంలోని 04 ఆయుష్ బోధనాస్పత్రుల్లో పంచకర్మ, యోగా సదుపాయాల కల్పన ద్వారా పక్షవాతం, కీళ్ల నొప్పులు వంటి దీర్ఘకాలిక సమస్యలకు శరీరాన్ని శుద్ధి చేసే ఉచిత సంప్రదాయ చికిత్సలు అందుబాటులోకి వస్తాయి.
**హెర్బల్ థెరపీ సేవలు:** విజయవాడలోని డాక్టర్ ఏఎల్ ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రిలో కంటి ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేకంగా అక్షి తర్పణ యూనిట్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నారు. ఆయుర్వేదంలో ఎంతో ప్రాముఖ్యత ఉన్న ఈ నేత్ర చికిత్స ద్వారా స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్ల మితిమీరిన వినియోగం వల్ల కలిగే కంటి అలసట, మంటలు, పొడిబారడం మరియు ప్రారంభ దృష్టిలోపాలకు సహజ సిద్ధమైన పరిష్కారం లభిస్తుంది. దీనితో పాటు, ఆసుపత్రిలోని బయట రోగులకు మరియు ఇన్‌పేషెంట్లకు నేరుగా తాజా మూలికా కషాయాలను అందించేందుకు హెర్బల్ క్వాథ థెరపీ యూనిట్‌ను ప్రారంభిస్తున్నారు. ఇది



రోగులలో వ్యాధి నిరోధక శక్తిని త్వరితగతిన పెంచడమే కాకుండా దీర్ఘకాలిక శ్వాసకోశ, జీర్ణకోశ సమస్యల నుండి తక్షణ ఉపశమనం కలిగిస్తుంది.
**యోగా వెల్నెస్ కేంద్రాలు:** నిరంతరం తీవ్రపని ఒత్తిడిని ఎదుర్కొనే ప్రభుత్వ ఉద్యోగులు, అధికారుల శారీరక, మానసిక ఆరోగ్య పరిరక్షణ కోసం రాష్ట్ర సచివాలయంలో ప్రత్యేక యోగా వెల్నెస్ కేంద్రాన్ని నెలకొల్పుతున్నారు. ఈ కేంద్రం ద్వారా ఉద్యోగుల్లో ఒత్తిడిని తగ్గించి, బీపీ, షుగర్, వెన్నునొప్పి వంటి జీవనశైలి ఆధారిత సమస్యలను నివారించి వారి పనితీరును మెరుగుపరచవచ్చు.
అదే విధంగా నాలుగు ప్రధాన జైళ్లలో కూడా ఇదే విధంగా ఏర్పాటు చేసి ఖైదీలలో మానసిక ఆరోగ్యం, జీవనశైలి మెరుగుపడేలా ఉపయోగపడుతుంది.
**హైకోర్టులో ఆయుష్ క్లినిక్:** హైకోర్టు ప్రాంగణంలో నూతనంగా ఆయుష్ క్లినిక్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఇది అక్కడ అందుబాటులో ఉండే న్యాయమూర్తులు, న్యాయవాదులు, హైకోర్టు సిబ్బందికి తక్షణ వైద్య సలహాలు, ప్రాథమిక ఆయుర్వేద చికిత్సలు అందించడానికి ఎంతో దోహదపడుతుంది.
**డిస్పెన్సరీల ఆధునికీకరణ:** 64 ప్రభుత్వ, పంచాయతీ, ప్రభుత్వ సహాయ ఆయుష్ డిస్పెన్సరీల అభివృద్ధికి రూ. 12.80 కోట్లు ఆమోదించారు. ఒక్కో డిస్పెన్సరీకి రూ. 20 లక్షల చొప్పున భవనాల మరమ్మతులు, ఫర్నిచర్, పరికరాలు, ఐటీ సదుపాయాలు, ఆయుష్ హెచ్.ఎం.ఐ.ఎస్ అమలు చేయనున్నారు. గత ఎస్.ఏ.ఏ.పీలో ఆమోదించిన 150 డిస్పెన్సరీలకు సంబంధించిన కమిటెడ్ లయబిలిటీల కోసం కూడా ఈ ఏడాది నిధులు కేటాయించారు.
**ఉచిత మందులు :** రాష్ట్రంలోని 712 ఆయుష్ డిస్పెన్సరీలకు ఉచిత మందుల సరఫరా కోసం రూ. 22.16 కోట్లు ఆమోదించారు. ఇందులో 334 ఆయుర్వేద, 192 హోమియోపతి, 75 యునానీ, 111 జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ డిస్పెన్సరీలు ఉన్నాయి. అదనంగా నాలుగు స్టాండలోన్ ఆయుష్ ఆస్పత్రులు, నాలుగు ఆయుష్ బోధనాస్పత్రులకు కూడా మందులు సరఫరా చేయనున్నారు.
**గిరిజన ప్రాంతాలకు సేవలు:** గిరిజన, మారుమూల ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలను వారి వద్దకే తీసుకెళ్లేందుకు 9 ఐటీడీఏల పరిధిలో 19 మొబైల్ మెడికల్ యూనిట్ల నిర్వహణకు రూ. 1.26 కోట్లు కేటాయించారు. రంపచోడవరం, చింతూరు, పార్వతీపురం, పాడేరు తదితర ప్రాంతాల్లో ఆయుష్ వైద్యాధికారులు, మల్టీపర్పస్ హెల్త్ వర్కర్లతో కూడిన బృందాలు సేవలు అందించనున్నాయి. ఉచిత వైద్య పరీక్షలు, ఆయుష్ మందుల పంపిణీతో పాటు వ్యాధుల నివారణ, పౌష్టికాహారం, ఆరోగ్యంపై అవగాహన కల్పించనున్నారు.
**ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు:** 126 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలకు రూ. 5.75 కోట్లు కేటాయించారు. యోగా ఇన్‌స్ట్రక్టర్ల సేవలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల ప్రోత్సాహకాలు, ల్యాబ్ సేవలు, శిక్షణ తదితరాలకు ఈ నిధులను వినియోగించనున్నారు.
**ప్రజారోగ్య ప్రాధాన్యాలు:** పాఠశాల విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించే ఆయుర్విద్య కార్యక్రమానికి రూ. 6.50 కోట్లు, కండరాల-ఎముకల సంబంధిత వ్యాధుల నివారణ, నిర్వహణ కార్యక్రమానికి రూ. 2.05 కోట్లు, వయోమిత్ర కార్యక్రమానికి రూ. 0.62 కోట్లు, సుప్రజ మాతా-శిశు ఆరోగ్య కార్యక్రమానికి రూ. 0.085 కోట్లు కేటాయించారు.
**విద్యా సంస్థల బలోపేతం:** ఆయుష్ విద్యాసంస్థల బలోపేతానికి రూ. 38.84 కోట్లు ఆమోదించారు. విశాఖపట్నంలోని 'విమ్స్' లో 100 పడకల ఆస్పత్రితో ప్రభుత్వ నేచురోపతి, యోగా కళాశాల ఏర్పాటుకు నిధులు కేటాయించారు. కాకినాడ, ధర్మవరం, ప్రొద్దుటూరు తదితర ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆయుష్ కళాశాలల అభివృద్ధికి కూడా నిధులు మంజూరయ్యాయి.
**వెల్నెస్ కేంద్రాలు :** 58 స్పెషాలిటీ వెల్నెస్ కేంద్రాలకు రూ. 5.28 కోట్లు మంజూరయ్యాయి. ఇందులో 55 ఆయుర్వేద పంచకర్మ, మూడు యునానీ కేంద్రాలు ఉన్నాయి. అలాగే ఆరు 50 పడకల సమీకృత ఆయుష్ ఆస్పత్రుల ఏర్పాటుకు గత ఏడాదే మంజూరు లభించింది. శ్రీకాకుళం (టెక్కలి), అల్లూరి సీతారామరాజు (రంపచోడవరం), ఎన్టీఆర్ (నందిగామ), గుంటూరు (తెనాలి), ప్రకాశం (గిద్దలూరు), తిరుపతి జిల్లాల్లో ఏర్పాటు చేస్తున్న ఈ ఆస్పత్రులకు ప్రస్తుత ఎస్.ఏ.ఏ.పీలో కొనసాగింపు బడ్జెట్‌ను కేటాయించారు. గ్రామీణ ప్రజలకు మందులు లేని ప్రకృతి వైద్యాన్ని దగ్గర చేసేందుకు జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ డిస్పెన్సరీల్లో నేచురోపతి యూనిట్లను అభివృద్ధి చేస్తున్నారు. డిజిటల్ విధానంలో, టెలిమెడిసిన్ సేవలతో ఆయుష్ వైద్యాన్ని ప్రతి ఒక్కరికీ సులభంగా చేరవేసేందుకు చర్యలు చేపట్టారు.
**ఆయుష్ వైద్య సేవల విస్తరణకు అధిక ప్రాధాన్యం : మంత్రి సత్యకుమార్:** సీఎం చంద్రబాబు సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన రూ. 185.75 కోట్ల వార్షిక ప్రణాళికకు ఆమోదం తెలిపినందుకు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆయుష్ శాఖ ఉన్నతాధికారులను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఆయుష్ వైద్య సేవల విస్తరణకు అధిక ప్రాధాన్య ఇస్తున్నట్లు తెలిపారు.

# అంతరిక్షమే.. భారత్ కొత్త గమ్యం

(మొదటి పేజీ తరువాయి)

భవిష్యత్తును నిర్మించుకోవడానికి భారత్‌కు రావాలనే భావన కలిగించే వాతావరణాన్ని సృష్టించాలని మోదీ పిలుపునిచ్చారు. భారత స్టార్టప్‌లోనో, భారత అంతరిక్ష సంస్థలోనో పనిచేయాలనే ఆకర్షణ ప్రపంచ యువతలో ఏర్పడాలని అన్నారు.
దీనికి ప్రభుత్వ విధానాల్లో స్థిరత్వం అత్యంత కీలకమని పేర్కొన్నారు. రిస్క్ తీసుకునే వ్యాపారవేత్తలకు, పెట్టుబడిదారులకు విధానపరమైన విశ్వాసం అవసరమని తెలిపారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు తరచూ మారకుండా స్థిరంగా ఉండాలని, అప్పుడే కొత్త రంగాల్లోకి అడుగుపెట్టే వారికి ధైర్యం కలుగుతుందని చెప్పారు.
కొత్త అంతరిక్ష రంగంలోకి ప్రవేశించి ధైర్యం చూపిన స్టార్టప్ వ్యవస్థాపకులను ఆయన అభినందించారు. ముఖ్యంగా ప్రభుత్వంపై విశ్వాసం ఉంచి ముందుకు వచ్చినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. వ్యాపారంలో స్వంత నిర్ణయాల వల్ల ఎదురయ్యే సవాళ్లు వేరని, కానీ రిస్క్ తీసుకున్న వారిని వ్యవస్థ ఒంటరిగా వదిలిపెట్టదనే నమ్మకం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.
భారత్ అంతరిక్ష రంగంలో గట్టి పోటీ ఇవ్వగల సామర్థ్యం కలిగిన దేశమని మోదీ ధీమా వ్యక్తం చేశారు. అత్యుత్తమ ప్రతిభ, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. భారతీయుల్లో సహజంగానే రిస్క్ తీసుకునే సామర్థ్యం ఎక్కువగా ఉందని, ఈ లక్షణంతో అంతరిక్ష రంగంలో వేగంగా ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకోవచ్చని అన్నారు.
ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతిభాసమూహాన్ని భారత్ అయస్కాంతంలా ఆకర్షించగలదని విశ్వాసం వ్యక్తం చేశారు. అలా ప్రపంచ ప్రతిభ భారత అంతరిక్ష రంగంతో కలిసివస్తే దేశానికి అపారమైన శక్తిగా మారుతుందని చెప్పారు.
**రైతుల దిగుబడి పెంపుదలకు సాయం చేయండి :** వ్యవసాయ రంగంతో పనిచేస్తున్న అంతరిక్ష సాంకేతిక సంస్థలు రైతులకు మరింత ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని ప్రధాని సూచించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయాలు,



సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని అంతరిక్ష సాంకేతికతను రైతుల నిర్ణయాలకు ఉపయోగపడేలా చేయాలని అన్నారు.
పంటల పరిస్థితి, భూసార సమాచారం, వాతావరణ మార్పులు, నీటి వినియోగం వంటి అంశాలపై అంతరిక్ష సాంకేతికత ద్వారా సమాచారం అందించి రైతులు మెరుగైన నిర్ణయాలు తీసుకునేలా చేయవచ్చని సూచించారు. తద్వారా వ్యవసాయ దిగుబడులు పెంచేందుకు స్టార్టప్‌లు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.
**ఇతర రంగాలతోనూ సమన్వయం :** అంతరిక్ష సంస్థలు తమ సాంకేతికతలకు కొత్త అనువర్తనాలను కనుగొనాలని ప్రధాని మోడీ సూచించారు. ప్రజల జీవితాలను మరింత సులభతరం చేయడంపై దృష్టి పెట్టాలని చెప్పారు. అంతరిక్ష రంగ సంస్థలు ఇతర రంగాల్లో పనిచేస్తున్న సంస్థలతో కూడా విస్తృత సహకారం పెంచుకోవాలని పేర్కొన్నారు.
ఉదాహరణగా అంతరిక్ష వ్యర్థాల నిర్వహణపై పనిచేస్తున్న సంస్థలు పర్యావరణ రంగ సంస్థలతో కలిసి పనిచేస్తే తమ సాంకేతికతను మరింత విస్తృతంగా వినియోగించుకోవచ్చని సూచించారు.
**చిన్నప్పటి నుంచే అంతరిక్షంపై ఆసక్తి :** అటల్ టింకరింగ్ ల్యాబ్‌లతో అంతరిక్ష రంగ సంస్థలు మరింత సన్నిహితంగా పనిచేయాలని మోడీ అన్నారు. దీనివల్ల చిన్న వయస్సు నుంచే విద్యార్థుల్లో అంతరిక్ష రంగంపై ఆసక్తి, ఉత్సుకత పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో అంతరిక్ష శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, పారిశ్రామికవేత్తలు దేశంలోనే తయారయ్యేలా యువతకు అవకాశాలు కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో అంతరిక్ష రంగంలో పనిచేస్తున్న సుమారు 20 స్టార్టప్‌ల సీఈఓలు, వ్యవస్థాపకులు పాల్గొన్నారు.
**చంద్రయాన్-3 విజయానికి గుర్తుగా.. :** 2023 ఆగస్టు 23న చంద్రయాన్-3 చంద్రుని దక్షిణ ధ్రువ ప్రాంతం సమీపంలో విజయవంతంగా సాఫ్ట్ ల్యాండింగ్ చేసి భారత అంతరిక్ష చరిత్రలో కొత్త అధ్యాయాన్ని సృష్టించిన విషయం తెలిసిందే. ఈ చారిత్రక విజయాన్ని గుర్తుచేసుకుంటూ ప్రతి ఏడాది ఆగస్టు 23ను జాతీయ అంతరిక్ష దినోత్సవంగా జరుపుకుంటున్నారు.
చంద్రునిపై అంతరిక్ష నౌకను విజయవంతంగా దించిన దేశాల్లో భారత్ నాలుగో దేశంగా నిలవడమే కాకుండా, చంద్రుని దక్షిణ ధ్రువ ప్రాంతం సమీపంలో ల్యాండింగ్ చేసిన తొలి దేశంగా చరిత్ర సృష్టించింది. ఈ విజయాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు భారత అంతరిక్ష రంగం ఇప్పుడు స్టార్టప్‌లు, ప్రైవేటు సంస్థలు, యువ ప్రతిభతో కొత్త దిశగా పయనిస్తోందని ప్రధాని మోడీ పేర్కొన్నారు.

## ఆధ్యాత్మిక ప్రగతి దారులు

(మొదటి పేజీ తరువాయి)



ఈ క్రమంలో పంచాయతీరాజ్ శాఖ ద్వారా 100కు పైగా ప్రధాన పుణ్యక్షేత్రాలను సుమారు 205 కిలోమీటర్ల మేర రహదారులతో అనుసంధానించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, వీబీజీ రాం జీ, సాస్కీ తదితర నిధులను వినియోగిస్తూ బడులు, గుడులు, ఆసుపత్రులు, పంట పొలాలకు వెళ్లే మార్గాల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు.
శ్రీ సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఆ జిల్లాలో పుట్టపర్తి అనుసంధాన రహదారుల నిర్మాణానికి రూ. 30 కోట్లు కేటాయించారు. ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో చేపట్టిన 'గుడి బాట' పనులను వేగంగా పూర్తి చేయాలని పవన్ కళ్యాణ్ ఎప్పటికప్పుడు అధికారులకు సూచిస్తున్నారు.
**రూ.120 కోట్లతో రహదారుల నిర్మాణం :** ఇప్పటి వరకు రూ. 120 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న రహదారుల్లో 26 పనులు పూర్తయ్యి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. మరో 40 శాతం రహదారులకు సంబంధించిన పనులు సుమారు 50 శాతం మేర పూర్తయ్యాయి.
ప్రఖ్యాత శ్రీ లక్ష్మీనరసింహ క్షేత్రం అంతర్వేది, అహోబిలం, మదనపల్లి నియోజకవర్గంలోని శ్రీ గట్టు వెంకటరమణ స్వామి ఆలయం, మారుమూల ప్రాంతంలోని దేవరాయ నల్లగంగమ్మ ఆలయం, మద్రిపూడి వద్ద ఉన్న పుడియగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం ఘాట్ రోడ్డు, సత్యవేడు నియోజకవర్గ పరిధిలోని సింగిరికోన, సోమేశ్వరం, తలుపులమ్మలోవ మార్గం, ఐఎస్ జగన్నాథపురం ఘాట్ రోడ్ల నిర్మాణం పూర్తయింది.
ఈ రహదారులను పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.
**వివిధ దశల్లో 'గుడి బాట' పనులు :** సాస్కీ నిధులతో చేపట్టిన కోనసీమ తిరుమల వాడపల్లి కరకట్ట మార్గం, రూ. 3 కోట్లతో నిర్మిస్తున్న అర్ధగిరి శ్రీ ఆంజనేయస్వామి ఆలయ రహదారి, తెనాలి, రాయచోటి తదితర నియోజకవర్గాల్లో చేపట్టిన రహదారులు, నిడదవోలులో ఆంజనేయస్వామి రోడ్డు, పూతలపట్టు నియోజకవర్గంలోని తోటవారిపల్లి మల్లేశ్వరస్వామి ఆలయ రహదారి తదితర పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయి.
శ్రీ సత్యసాయి జిల్లాకు కేటాయించిన సుమారు 72 కిలోమీటర్ల రహదారుల పనులు కూడా వివిధ దశల్లో కొనసాగుతున్నాయి.
పుణ్యక్షేత్రాలకు వెళ్లే రహదారుల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. పంచాయతీరాజ్ శాఖ నిర్మించే రహదారులు భక్తులకు సుదీర్ఘకాలం ఉపయోగపడేలా ఉండాలని సూచించారు.
క్షేత్రస్థాయి పర్యటనల్లో నిర్మాణం పూర్తయిన ఆలయ రహదారుల నాణ్యతను స్వయంగా పరిశీలించి, వాటిని భక్తులకు అందుబాటులోకి తీసుకువస్తామని అధికారులకు తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో మరిన్ని ఆలయాలకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించేందుకు పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

# డిగ్రీ ఒక తలుపు మాత్రమే.. విజయాన్ని నిర్ణయించేది నైపుణ్యం



**విశాఖపట్నం(జర్నలిస్ట్ ఫైల్) :** డిగ్రీ అనేది అవకాశాల తలుపు తెరిచే తాళం చెవి మాత్రమేనని, నిజమైన విజయాన్ని నిర్ణయించేది నైపుణ్యం, పట్టుదల, క్రమశిక్షణ, వ్యక్తిత్వమని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గీతంవిశ్వవిద్యాలయం 17వ స్నాతకోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన పట్టాలు అందుకున్న విద్యార్థులను ఉద్దేశించి ప్రేరణాత్మక ప్రసంగం చేశారు.
విద్య ఒక వ్యక్తి జీవితాన్నే కాదు, సమాజ భవిష్యత్తును కూడా మార్చగల శక్తి అని పేర్కొన్న మంత్రి, జిటామ్ వ్యవస్థాపకుడు ఎం.వి.వి.ఎస్. మూర్తి విద్య ద్వారా భావితరాలను తీర్చిదిద్దాలనే ఆశయంతో పనిచేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం కృత్రిమ మేధస్సు, రోబోటిక్స్ వంటి సాంకేతికతలు ప్రపంచాన్ని వేగంగా మార్చుతున్నాయని, కొన్ని ఉద్యోగాలు కనుమరుగైనా కొత్త అవకాశాలు పుట్టుకొస్తాయని చెప్పారు. మార్పును చూసి భయపడకుండా నిరంతరం నేర్చుకునే వారే భవిష్యత్తులో ముందంజలో ఉంటారని అన్నారు.
దీర్ఘకాలిక కెరీర్ విజయానికి మార్కులు మాత్రమే సరిపోవని, కాన్షియెన్షియస్‌నెస్, గ్రిట్, లీడర్‌షిప్, ఎమోషనల్ రెగ్యులేషన్, రిస్క్ తీసుకునే సామర్థ్యం వంటి లక్షణాలు అత్యంత కీలకమని వివరించారు. ఒక రంగంలో లోతైన, ఆచరణాత్మక పరిజ్ఞానం సంపాదించి సమస్యలకు పరిష్కారాలు చూపగల స్థాయికి ఎదగాలని సూచించారు. ఉద్యోగాల కోసం ఎదురుచూసే జాబ్ సీకర్స్ కంటే, కొత్త అవకాశాలు సృష్టించే జాబ్ క్రియేటర్స్ దేశానికి అవసరమని ఆయన స్పష్టం చేశారు.
జీవితంలో షార్ట్‌కట్స్ ఉండవని, లెక్కచేసిన రిస్క్‌లు తీసుకుంటూ వైఫల్యాల నుంచి నేర్చుకోవాలని విద్యార్థులకు మంత్రి సూచించారు. తాత్కాలిక గుర్తింపు కంటే సామర్థ్యం, విశ్వసనీయత, వ్యక్తిత్వ నిర్మాణంకు ప్రాధాన్యం ఇవ్వాలని, నిజాయితీ, బాధ్యత, ఇతరులకు గౌరవం వంటి విలువలే మనిషిని ఉన్నత స్థానానికి చేర్చుతాయని అన్నారు. కెరీర్‌తో పాటు ఆరోగ్యం, నిద్ర, వ్యాయామం, మంచి ఆహారం, సార్థకమైన సంబంధాలకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు.
ప్రపంచ ఆర్థిక, సాంకేతిక శక్తిగా భారత్ ఎదుగుతున్న కీలక సమయంలో పట్టభద్రులవుతున్న విద్యార్థులు తమ నైపుణ్యాలతో దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని డా. పెమ్మసాని చంద్రశేఖర్ ఆకాంక్షించారు. గీతం 17వ స్నాతకోత్సవంలో పట్టాలు అందుకున్న విద్యార్థులందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

# ఉయ్యూరులో డయేరియా పరిస్థితి అదుపులోనే

- **19 మంది బాధితులు.. 9 మందికి ఆసుపత్రిలో చికిత్స**
- **6గురి డిశ్చార్జ్ ... నిలకడగా రోగుల ఆరోగ్యం**
- **రాష్ట్ర మంత్రి సత్య కుమార్ యాదవ్ కు చేరిన ప్రాథమిక నివేదిక**



**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్):**కృష్ణా జిల్లా ఉయ్యూరు మున్సిపాలిటీ పరిధిలో నమోదైన డయేరియా కేసుల పరిస్థితి ప్రస్తుతం అదుపులోనే ఉందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ తెలిపింది. ఆగస్టు 19 నుంచి 23 వరకు 5, 7, 9వ వార్డుల్లో మొత్తం 19 మంది తీవ్ర విరేచనాల లక్షణాలతో బాధపడినట్లు గుర్తించారు. వీరిలో 15 మందిని ఉయ్యూరు సీహెచ్‌సీలో చేర్చారు. ఆరుగురు చికిత్స అనంతరం ఇళ్లకు వెళ్లారు. 9 మంది ఆసుపత్రిలో ఉన్నారు. మిగిలిన నలుగురికి ఓపీ, ఇంటి వద్దే చికిత్స అందించారు. బాధితుల ఆరోగ్యం నిలకడగా ఉందని అధికారులు తెలిపారు.

**అధికారుల బృందం క్షేత్రస్థాయి పరిశీలన**

ఉయ్యూరులో డయేరియా కేసులపై రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆదేశాల మేరకు ఆదివారశీ రాష్ట్ర వైద్య బృందశీ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి క్షేత్రస్థాయి పరిశీలన చేసిశీది.

పర్యటించిన బృందంలో డాక్టర్ కె. అర్జునరావు, జాయింట్ డైరెక్టర్, సీడీపీ, రాష్ట్ర సర్వైలెన్స్ యూనిట్, డాక్టర్ పి.ఎల్. దయాకర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి, కృష్ణా జిల్లా, డాక్టర్ ఏ.వి. శేషుకుమార్, డీసీహెచ్‌ఎస్, కృష్ణా జిల్లా ఉన్నారు. వీరితో పాటు సిద్ధార్థ మెడికల్ కాలేజ్, విజయవాడకు చెందిన పీడియాట్రిక్స్, మైక్రోబయాలజీ, సోషల్ అండ్ ప్రివెంటివ్ మెడిసిన్ విభాగాల నిపుణులతో కూడిన ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్ కూడా ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించింది. బృందంలో సిద్ధార్థ మెడికల్ కాలేజ్ పీడియాట్రిక్స్ డా.. అశ్విని, ఇతర వైద్యులు బృందంలో ఉన్నారు. ప్రాథమిక నివేదికను వైద్య బృందం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి శ్రీ సత్య కుమార్ యాదవ్ కు పంపించింది. మొత్తం 19 కేసులు నమోదయాయని, అందరి ఆరోగ్యం నిలకడగా ఉందని మరణాలు సంభవించలేదని నివేదికలో పేర్కొంది. దీనిని పరిశీలించిన రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ శ్రీ చక్రధర్ బాబు పరిస్థితులు పూర్తి స్థాయిలో అదుపులోకి వచ్చేంత వరకు ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగుతూనే ఉండాలని సదరు అధికారులకు స్పష్టం చేశారు

**5, 7, 9వ వార్డుల్లోనే కేసులు :** ఉయ్యూరు మున్సిపాలిటీ పరిధిలోని 5, 7, 9వ వార్డుల్లోనే కేసులు కేంద్రీకృతమయ్యాయి. ఆగస్టు 19న 5వ వార్డులోని శ్రీలంక కాలనీలో తొలి కేసు గుర్తించారు. అనంతరం 5, 7, 9వ వార్డుల్లో వరుసగా కేసులు నమోదయ్యాయి. ఆగస్టు 23 నాటికి మొత్తం కేసుల సంఖ్య 19కి చేరింది.

ఆగస్టు 20 నుంచి ప్రభావిత వార్డుల్లో రెండు వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఆగస్టు 19 నుంచే 10 బృందాలతో ఇంటింటా యాక్టివ్ ర్యాపిడ్ హౌస్‌హోల్డ్ సర్వైలెన్స్ కొనసాగుతోంది.

**తాగునీటిపై ప్రత్యేక దృష్టి :** ప్రభావిత వార్డుల్లో తాగునీటికి వాసన, రుచి మారినట్లు ఫిర్యాదులు రావడంతో నీటి వనరులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. 7వ వార్డు నుంచి 25 నీటి నమూనాలు, 5, 9వ వార్డుల నుంచి మరో నాలుగు నమూనాలు సేకరించి పరీక్షలకు పంపించారు.

బాధితుల నుంచి సేకరించిన మల నమూనాలను కూడా ప్రయోగశాలకు పంపించారు. నీటి నమూనాలను బ్యాక్టీరియాలజీ పరీక్షలకు, మల నమూనాలను కల్చర్, సెన్సిటివిటీ, మైక్రోస్కోపీ పరీక్షలకు పంపినట్లు అధికారులు తెలిపారు. ప్రయోగశాల పరీక్షల ఫలితాలు వచ్చిన తర్వాతే డయేరియాకు ఖచ్చితమైన కారణాన్ని నిర్ధారించనున్నారు. క్షేత్రస్థాయి విచారణలో ప్రభావిత ప్రాంతాల్లోని పలువురు బాధితులు వ్యాధి లక్షణాలు కనిపించే ముందు స్థానికంగా బయట నుంచి ఆహారం తీసుకున్నట్లు గుర్తించారు. అదే సమయంలో ప్రభావిత వార్డుల్లోని అనేక కుటుంబాలు తాగునీటి నాణ్యత మారినట్లు అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కమ్యూనిటీ తాగునీటి వనరు కలుషితం కావడం ప్రధాన కారణమై ఉండొచ్చని, బయట ఆహారం తీసుకోవడం కూడా వ్యాధి వ్యాప్తికి దోహదపడి ఉండవచ్చని వైద్య బృందం ప్రాథమికంగా అంచనా వేసింది. ల్యాబ్ ఫలితాల అనంతరం తుది కారణం స్పష్టమవుతుందని అధికారులు తెలిపారు.

**ప్రత్యామ్నాయ తాగునీటి సరఫరా :** ఉయ్యూరు మున్సిపాలిటీతో సమన్వయం చేసుకుని ప్రభావిత ప్రాంతాల్లో తాగునీటి వనరులకు క్లోరినేషన్ చేపట్టారు. ప్రజల అవసరాల కోసం ట్యాంకర్ల ద్వారా ప్రత్యామ్నాయ తాగునీటి సరఫరా ఏర్పాటు చేశారు.

ప్రభావిత వార్డుల్లో ఓఆర్ఎస్ , జింక్ మాత్రలను పంపిణీ చేస్తున్నారు. ఉయ్యూరు సీహెచ్‌సీలో అవసరమైన ఐవీ ద్రవాలు, ఓఆర్ఎస్, అత్యవసర మందులను అందుబాటులో ఉంచారు.

**ఇంటింటా సర్వే.. అవగాహన :** రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ చక్రధర్ బాబు ఆదేశాల అనుసరించి సీనియర్ వైద్యుల పర్యవేక్షణలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలతో ఇంటింటా సర్వే కొనసాగుతోంది. అనుమానిత కేసులను గుర్తించి అవసరమైన వారికి తక్షణ వైద్య సేవలు అందిస్తున్నారు. సేవల్లో లోపశీ రాకుండా చూడాలని వైద్యులకు కమిషనర్ చక్రధర్ బాబు స్పష్టం చేశారు.

**నిరంతరం పర్యవేక్షణ :** క్షేత్రస్థాయి పరిశీలనలో కేసులు పరిమిత ప్రాంతంలోనే ఉన్నట్లు అధికారులు గుర్తించారు. 5, 7, 9వ వార్డుల్లో కేసులు కేంద్రీకృతమైనప్పటికీ పక్క గ్రామాలకు వ్యాప్తి చెందినట్లు ఆధారాలు లేవని నివేదికలో పేర్కొన్నారు.

చాలా మంది బాధితులు 40-60 ఏళ్ల వయసు వారని, వ్యక్తి నుంచి వ్యక్తికి వ్యాప్తి జరిగినట్లు ఆధారాలు లేవని వైద్య బృందం గుర్తించింది.

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, డిస్ట్రిక్ట్ సర్వైలెన్స్ యూనిట్, ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నాయి.

# అందరిపై అమ్మ ఆశీస్సులు



- **పోలేరమ్మ దేవస్థానంలో పొంగళ్ళ మహోత్సవం**
- **ప్రత్యేక పూజలు నిర్వహించిన లేళ్ళ అప్పిరెడ్డి**

**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్ ):** భక్తుల పాలిట కల్పతరువై.. మనసారా వేడిన మహిళల కొంగు బంగారమై.. వారి కష్టాలను కడతేర్చి, అష్టైశ్వర్యాలను ప్రసాదించే జగన్మాతగా చుట్టుగుంట పోలేరమ్మ తల్లి పూజలందుకుంటున్నట్లు శాసనమండలి సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి వెల్లడించారు. ఎంతో ప్రాశస్త్యం గల ఆ అమ్మ ఆశీస్సులు అందరిపై ఉండాలన్న ఆకాంక్షను ఆయన వ్యక్తం చేశారు.

చుట్టుగుంటలోని పోలేరమ్మ తల్లి దేవస్థానంలో ఆదివారం అత్యంత భక్తి శ్రద్ధలతో పొంగళ్ళ మహోత్సవం జరిగింది. ఈ ఉత్సవాలకు హాజరైన ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణను ప్రారంభించారు.

ఈ సందర్భంగా లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ, చుట్టుగుంటలో కొలువైన పోలేరమ్మ తల్లి అత్యంత మహిమాన్వితురాలని తెలిపారు. ఆమెకు ఉత్సవాలు జరపడం మొదలు పెట్టిన నాటి నుంచే ఈ ప్రాంతంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలు కూడా అభివృద్ధి చెందడం మొదలైనట్లు చెప్పారు. భక్తులు కోరిన కోర్కెలు తీర్చే చల్లని తల్లి పోలేరమ్మ అని తెలిపారు. శక్తి ప్రదాయని అయిన చుట్టుగుంట పోలేరమ్మ తల్లిని అత్యంత భక్తిశ్రద్ధలతో దర్శించి, అర్చించి, తరించవలసిందిగా ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో చుట్టుగుంట పోలేరమ్మ దేవస్థానం ఉత్సవ కమిటీ సభ్యులు అంగడి శ్రీనివాసరావు, కుమ్మర చంద్ర, అడకా శ్రీను, సాంబిరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పాల శ్రీను, కుమ్మర కోటేశ్వరరావు, చెన్నకేశవరెడ్డి, పంది శేషగిరి, అడకా పద్మావతి, అచ్చాల వెంకటరెడ్డి, నేతలు బందా రవీంద్రనాథ్, ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), షేక్ రోషన్, పరిశపోగు శ్రీనివాసరావు, నూనె ఉమామహేశ్వరరెడ్డి, మంత్రి మహానంది, బైరెడ్డి రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అభినవ రాబిన్ హుడ్ వంగవీటి రంగా:మంత్రి కందుల దుర్గేష్



- **కానూరు అగ్రహారంలో శ్రీకృష్ణదేవరాయలు, వంగవీటి రంగా విగ్రహాల ఆవిష్కరణలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న మంత్రి కందుల దుర్గేష్, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు**
- **శాంతి కపోతాలు ఎగురవేసి, వృద్ధులకు, మహిళలకు దుప్పట్లు పంపిణీ**

**నిడదవోలు (జర్నలిస్ట్ ఫైల్) :** నిడదవోలు నియోజకవర్గం పెరవలి మండలం కానూరు అగ్రహారంలో శ్రీ కృష్ణదేవరాయ కాపు ఐక్యత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు, పేదల బాంధవుడు వంగవీటి మోహన రంగాల విగ్రహావిష్కరణ మహోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు ముఖ్య అతిథులుగా హాజరై, విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం శాంతికి ప్రతీకగా శాంతి కపోతాలను గాల్లోకి ఎగురవేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలువురు వృద్ధులకు, మహిళలకు దుప్పట్లు పంపిణీ చేశారు. గ్రామానికి విచ్చేసే ప్రజలు, ప్రయాణికులు సేదతీరేలా అద్భుతమైన మండపం ఏర్పాటు చేసి విగ్రహాలను ప్రతిష్ఠించడం ద్వారా గ్రామ నిర్వాహకులు 'కానూరు అగ్రహారం' పేరును నిజమైన అర్థంలో సార్థకం చేసుకున్నారని మంత్రి అభినందించారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ..."సాహితి సమరాంగణ సార్వభౌముడిగా, 'దేశభాషలందు తెలుగు లెస్స' అని చాటిన శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని ఇక్కడ నెలకొల్పడం అభినందనీయం. ఆనాటి కాలంలోనే సాంకేతికత లేకపోయినా ప్రతి ఇంటికీ తాగునీరు అందించిన గొప్ప విజన్ ఆయనది. నేడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామీణ ప్రాంతాలకు శరవేగంగా మంచి నీరు అందిస్తున్నాం." అన్నారు. అదే విధంగా "కులమతాలకు అతీతంగా పేదవాడికి కష్టం వస్తే 'నేను ఉన్నాను' అని నిలబడిన అభినవ రాబిన్ హుడ్ వంగవీటి మోహన రంగా. ఆయన భౌతికంగా దూరమై దశాబ్దాలు గడిచినా, నేటి యువత 'రంగా అమర్ రహే' అని స్మరించుకుంటున్నారంటే ఆయన ప్రజాదరణ ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు. రంగా ఆశయ సాధనకు నిరంతరం కృషిచేస్తాను."అని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు.

**కానూరు అగ్రహార అభివృద్ధికి రూ. 4.40 కోట్లు:** "రెండేళ్ల కాలంలో కూటమి ప్రభుత్వ హయాంలో రూ. 4.40 కోట్లతో కానూరు అగ్రహారాన్ని సమగ్రంగా అభివృద్ధి చేశాం. జల్ జీవన్ మిషన్ కింద రూ. 73 లక్షల నిధులతో ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేస్తున్నాం. ఈ పనులకు ఇప్పటికే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ శంకుస్థాపన చేశారు. రాబోయే సెప్టెంబర్ నాటికి గ్రామంలో నూతన రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభిస్తాం. అలాగే హిందూ స్మశాన వాటిక ఏర్పాటుకు చర్యలు తీసుకోవడంతో పాటు, ఇప్పటికే పూర్తి చేసిన దళిత కమ్యూనిటీ హాల్ తరహాలోనే ఇతర సామాజిక వర్గాలకు కూడా కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపడతాం." అని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేబినెట్‌లో పనిచేయడం గర్వంగా ఉందన్న మంత్రి దుర్గేష్... డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆశీస్సులతో తనను ఎమ్మెల్యేగా, మంత్రిగా ఆదరించిన నిడదవోలు నియోజకవర్గ ప్రజలకు జీవితాంతం ప్రజాసేవకుడిగా రుణపడి ఉంటానని తెలిపారు.

ఈ కార్యక్రమంలో హౌసింగ్ బోర్డు డైరెక్టర్ ప్రియ సౌజన్య, పెరవలి మండల టీడీపీ అధ్యక్షులు అతికారి శ్రీను, జనసేన అధ్యక్షులు పిప్పర రవి, జెడ్పీటీసీ రామాంజనేయులు, ఎంపీటీసీలు, కూటమి నాయకులు మరియు వంగవీటి రంగా అభిమానులు, గ్రామస్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



### రాష్ట్రపతి ఉత్తర్వులు-2025 పేరుతో
# పదోన్నతులు, బదిలీలు నిలిపివేయొద్దు

- **నిషేధాన్ని తక్షణమే ఎత్తివేయాలని ప్రభుత్వానికి ఆస్కార్ రావు డిమాండ్**



**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రపతి ఉత్తర్వులు-2025 అమలు పేరుతో ప్రభుత్వ ఉద్యోగుల హక్కుగా సంక్రమించిన పదోన్నతులు, బదిలీల ప్రక్రియను నిలిపివేయడం అన్యాయమని ఏపీ ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఉద్యోగ వేదిక ఛైర్మన్ ఆస్కార్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉత్తర్వుల అమలుకు ఇంకా సుమారు 27 నెలల గడువు ఉన్నప్పటికీ హడావుడిగా చర్యలు చేపట్టి ప్రభుత్వ శాఖల్లో అయోమయం సృష్టించారని ఆయన విమర్శించారు.

ఉద్యోగ సంఘాలతో సమావేశాలు నిర్వహించినప్పటికీ వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) ముందుకు సాగుతోందని ఆస్కార్ రావు ఆరోపించారు. వైద్య ఆరోగ్య శాఖలో జి.ఓ. 32 ప్రకారం సిబ్బంది సర్దుబాటు ప్రక్రియ ఇంకా ప్రారంభ దశలోనే ఉండగా, దానిని పూర్తి చేయకుండానే కొత్త ఉత్తర్వులను ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. ఇదే కారణంగా అనేక కోర్టు కేసులు నమోదయ్యాయని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం సమయం వెచ్చించాల్సి వస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజారోగ్య నర్సులు, మల్టీ పర్పస్ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారులు నుంచి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ గెజిటెడ్ కేడర్‌కు జరగాల్సిన పదోన్నతులు ఏడాదిగా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఏసీఆర్‌లు కూడా పిలిచినప్పటికీ ప్రమోషన్లు నిలిచిపోయాయని, జోన్-2లో ఎంపీహెచ్ఈఓ పదోన్నతులు, గ్రామ-వార్డు సచివాలయ ఏఎన్ఎంల పదోన్నతులు కూడా నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ముఖ్యంగా మహిళా ఉద్యోగులు పదోన్నతి పొందకుండానే పదవీ విరమణ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పదోన్నతులు, బదిలీలపై విధించిన నిషేధాన్ని వెంటనే ఎత్తివేసి యథావిధిగా ప్రక్రియ ప్రారంభించాలని ఆస్కార్ రావు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఇదే అంశంపై హైకోర్టులో డబ్ల్యూ.పీ. నెం. 18167/2026 దాఖలు చేసినట్లు, జీఏడీని ప్రతివాదిగా చేర్చామని తెలిపారు. కేసులో కౌంటర్ దాఖలు చేయడంలో అధికారులు జాప్యం చేస్తున్నారని, అలాగే ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్. రావత్‌కు కూడా సంఘం తరఫున లేఖ పంపినట్లు వెల్లడించారు.

# 14వ రోజుకు జూడాల సమ్మె

- **ప్రభుత్వం చర్చలు ప్రారంభించాలని వైద్యుల డిమాండ్**



**గుంటూరు,(జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (ఏపీ జూడా) రాష్ట్రవ్యాప్త సమ్మె 14వ రోజు, మూడో దశలో ఏడో రోజు ఆదివారం కొనసాగింది. గుంటూరు మెడికల్ కాలేజీకి చెందిన రెసిడెంట్లు, ఇంటర్న్‌లు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ కార్యాలయం సమీపంలో శాంతియుత నిరసన చేపట్టారు.

కొనసాగుతున్న ఆందోళనలో భాగంగా సుమారు 15 మంది పీజీ రెసిడెంట్లు స్వచ్ఛంద రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఉదయం జూడా న్యాయబద్ధమైన డిమాండ్లకు మద్దతుగా నినాదాలతో నిరసన కార్యక్రమాలు ప్రారంభమై రోజంతా కొనసాగాయి.

ఇటీవల నిర్వహించిన విలేకరుల సమావేశం అనంతరం కూడా రెసిడెంట్లు, ఇంటర్న్‌లు లేవనెత్తిన సమస్యలపై ప్రభుత్వం ఇప్పటివరకు తదుపరి చర్చలకు ఆహ్వానించలేదని జూడా నాయకులు తెలిపారు. అర్థవంతమైన చర్చలకు అవకాశం లేకపోవడం వల్ల నిరసనలో పాల్గొంటున్న వైద్యుల్లో ఆందోళన మరింత పెరుగుతోందని పేర్కొన్నారు.

ఆదివారం కార్యక్రమాల్లో భాగంగా "మన సమస్యలను ఒక్క మాటలో ఎలా చెప్పగలరు?" అనే అంశంపై ఇంటరాక్టివ్ కార్యక్రమం నిర్వహించి వైద్యులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. అలాగే సమ్మెకు సంబంధించిన సమస్యలు, డిమాండ్లను హావభావాల ద్వారా వివరించే డంబ్ షరాడ్స్ కార్యక్రమం నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించే ప్రయత్నం చేశారు.

ప్రభుత్వం తక్షణమే చర్చలు ప్రారంభించి రెసిడెంట్లు, ఇంటర్న్‌ల న్యాయబద్ధమైన సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని ఏపీ జూడా డిమాండ్ చేసింది.

# బ్యాంకు ఖాతాలను అనవసరంగా మార్చొద్దు

- **ఆధార్ సీడింగ్ పూర్తికాక ఖాతాలు మారిస్తే ఉద్యోగుల వేతనాల చెల్లింపుల్లో జాప్యం**
- **ఎన్.హెచ్.ఎం ఉద్యోగుల విషయమై జిల్లా అధికారులకు ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ చక్రధర్‌బాబు ఆదేశాలు**

**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్):**జాతీయ ఆరోగ్య మిషన్ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులు సహేతుకమైన కారణాలు లేకుండా బ్యాంకు ఖాతాలను మార్చుకోవద్దని రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ చక్రధర్‌బాబు సూచించారు. ఆధార్ సీడింగ్ పూర్తికాకముందే బ్యాంకు ఖాతాలను మార్చుకోవడం వల్ల ఆధార్ ఆధారిత చెల్లింపు విధానం-డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తి వేతనాల చెల్లింపుల్లో జాప్యం జరుగుతోందని తెలిపారు. ఈ అంశంపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఎన్. హెచ్. ఎం సిబ్బంది వేతనాలు ఆధార్ ఆధారిత చెల్లింపు విధానం-డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ విధానంలో ఉద్యోగుల ఆధార్‌కు అనుసంధానమైన బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ అవుతున్నాయి. వేతన బిల్లుల ప్రక్రియ పూర్తయిన తర్వాత అర్హత కలిగిన ఉద్యోగికి చెల్లించాల్సిన మొత్తం ఎలక్ట్రానిక్ విధానంలో సంబంధిత ఖాతాకు బదిలీ అవుతుంది. ఈ నేపథ్యంలో కొందరు ఉద్యోగులు ఆధార్ సీడింగ్ పూర్తికాకముందే బ్యాంకు ఖాతాలను మార్చుకుంటుండటంతో చెల్లింపుల ప్రక్రియలో సమస్యలు ఏర్పడుతున్నాయి.

బ్యాంకు ఖాతాల మార్పు, ఆధార్ సీడింగ్‌లో జాప్యం కారణంగా ఒకే బిల్లులో వేలాది మంది ఉద్యోగుల వేతనాల చెల్లింపులు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో సుమారు రూ. 60-70 కోట్ల మేర బిల్లుల చెల్లింపులపై ప్రభావం కనిపిస్తోంది. ఆధార్--బ్యాంకు ఖాతా అనుసంధానంలో ఏర్పడిన సమస్యలను గుర్తించి సరిచేసే వరకు సమయం పడుతుండటంతో ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సహేతుకమైన కారణాలు లేకుండా బ్యాంకు ఖాతాలను మార్చుకోవద్దని అధికారులు ఉద్యోగులకు సూచించారు. అనివార్య పరిస్థితుల్లో ఖాతా మార్చాల్సి వస్తే కొత్త బ్యాంకు ఖాతాకు ఆధార్ సీడింగ్ పూర్తయిన తర్వాతే ఉద్యోగ రికార్డుల్లో ఖాతా వివరాలను మార్చుకోవాలని స్పష్టం చేశారు.

అలాగే బ్యాంకు రికార్డుల్లో నమోదైన ఉద్యోగి పేరు, ఖాతా నంబరు, ఇతర వివరాలు ఉద్యోగ రికార్డులతో సరిపోతున్నాయో ముందుగానే పరిశీలించుకోవాలని సూచించారు. వేతనాల చెల్లింపుల్లో అనవసర జాప్యాన్ని నివారించేందుకు ఉద్యోగులు, జిల్లా అధికారులు ఈ అంశంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కమిషనర్ ఆదేశించారు.

### మద్యం రవాణా కేసులో
# కారుమూరి అరెస్ట్!



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :**ఏపీలో సంచలనం సృష్టించిన మద్యం రవాణా కుంభకోణం, మనీలాండరింగ్ కేసుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తు ముమ్మరం చేసింది. ఈ క్రమంలోనే కీలక పరిమాణం చోటుచేసుకుంది. వైఎస్సార్సీపీ నేత, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావును ఇవాళ హైదరాబాద్ కొండాపూర్‌లో ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు. అనంతరం వైద్యపరీక్షల నిమిత్తం కారుమూరిని అధికారులు గాంధీ ఆసుపత్రికి తరలించారు.

**అసలేం జరిగిదంటే :** లిక్కర్ స్కాంలో వేల కోట్లు కొల్లగొట్టిన వైఎస్సార్సీపీ ముఠా మద్యం రవాణా కాంట్రాక్టుల్లో కూడా దోపిడీకి తెగబడిందని ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ ప్రాథమికంగా గుర్తించింది. ఈ కుంభకోణంపై ఈ ఏడాది ఫిబ్రవరిలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది. ఈ స్కాంలో మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు గుర్తించిన ఈడీ కొన్ని నెలల కిందట ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ (ఈసీఆర్) నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది.

ఇందులో భాగంగా బెవరేజెస్ కార్పొరేషన్ అప్పటి ఎండీ డి.వాసుదేవరెడ్డి, వైఎస్సార్సీపీ ముఠా తరఫున అన్నీ తానై వ్యవహరించిన రాజ్ కెసిరెడ్డి, వైసీపీ నేత, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కుమారుడు సునీల్‌కుమార్ ఇళ్లల్లో ఈడీ సోదాలు చేసింది. ఆ తర్వాత వారిని అరెస్ట్ చేసింది. వీరు ముగ్గురూ ప్రస్తుతం రిమాండ్‌లోనే ఉన్నారు. మరోవైపు ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ సైతం వీరిని ట్రాన్సిట్ వారెంట్‌పై విజయవాడకు తీసుకొచ్చి విచారించింది.

తాజాగా ఇవాళ కారుమూరి నాగేశ్వరరావును ఈడీ అరెస్ట్ చేసింది. మద్యం రవాణా కుంభకోణంలో వైఎస్సార్సీపీ ముఠా రూ. 195 కోట్లు దోచుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తేల్చింది. అప్పటి బెవరేజెస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవ రెడ్డి లిక్కర్ రవాణా టెండర్‌ను తమ ముసుగు సంస్థ సిగ్మాకు కట్టబెట్టారని వెల్లడించింది. ఒక్కో మద్యం కేసుకు కిలోమీటరుకు రూ. 13ల చొప్పున చెల్లించే రవాణా ఛార్జీలను రూ. 35కు పెంచేసి దోచుకున్నట్లు తెలిపింది.

మరోవైపు కోస్తాంధ్రలో రవాణా వాహనాల కోసం సుదర్శన్ కన్‌స్ట్రక్షన్స్ అనే సంస్థతో సిగ్మా సంస్థ ఒప్పందం కుదుర్చుకుందని సిట్ తెలిపింది. ఈ సంస్థను నాటి మంత్రి, వైఎస్సార్సీపీ నేత కారుమూరి నాగేశ్వరరావు రంగంలోకి దించారని తన కుమారుడు కారుమూరి సునీల్, కోడలు కీర్తి ఆ సంస్థతో మరో ఒప్పందం చేసుకున్నట్లు సృష్టించారని గుర్తించింది. పేరుకే సుదర్శన్ కన్‌స్ట్రక్షన్ తప్ప నిర్వహణ మొత్తం కారుమూరి నాగేశ్వరరావు, ఆయన కుమారుడు సునీలే చూసుకున్నారని సిట్ దర్యాప్తులో తేలింది. ఈడీ విచారణలోనూ ఇదే వెల్లడైంది.

సుదర్శన్ కన్‌స్ట్రక్షన్ సంస్థ వల్లు సందీప్ అనే వ్యక్తిదని సిగ్మా నుంచి ఆ సంస్థ ఖాతాల్లోకి రూ. 68 కోట్లు చేరగా అందులోంచి రూ. 15 కోట్లు కారుమూరి నాగేశ్వరరావు, ఆయన కుమారుడు సునీల్, కోడలు కీర్తి ఖాతాల్లోకి జమైనట్లు వెల్లడైంది. మరికొంత సొమ్ము నగదు రూపంలో వారికి అందినట్లు ఈడీ గుర్తించింది. రెండు నెలల క్రితం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చేసిన సోదాల్లో ఈ హవాలా లావాదేవీల ఆధారాలు, సుదర్శన్ కన్‌స్ట్రక్షన్‌తో కుదిరినట్లు చెబుతున్న ఒప్పంద పత్రాలు లభ్యమయ్యాయి. ఒప్పందపత్రం అసలైనదేనా హవాలా లావాదేవీల ఇతర వివరాలేంటనే కోణంలో ఈడీ దర్యాప్తు ముమ్మరం చేస్తోంది.

# సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

**నిడదవోలు(జర్నలిస్ట్ ఫైల్) :** ఆగస్టు 22: నిరుపేద ప్రజల ఆరోగ్య భద్రతకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కొండంత అండగా నిలుస్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. నిడదవోలులోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన 45 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 48,39,268 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్ఓసీ పత్రాలను ఆయన పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 39 మందికి రూ. 25,53,383 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు, మరో ఆరుగురికి రూ. 22,85,886 విలువైన ఎల్ఓసీ పత్రాలు అందజేశామని తెలిపారు. నిడదవోలు నియోజకవర్గంలో ఇప్పటివరకు సీఎంఆర్ఎఫ్, ఎల్ఓసీ, ప్రత్యేక ఆర్థిక సాయం ద్వారా 1,092 మంది బాధితులకు రూ. 7,66,07,826 లబ్ధి చేకూరిందని వెల్లడించారు. తీవ్ర అనారోగ్యం, అనుకోని ప్రమాదాల వల్ల నిరుపేద కుటుంబాలు ఆర్థికంగా కుంగిపోకుండా ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ ద్వారా భరోసా కల్పిస్తోందని మంత్రి పేర్కొన్నారు. అర్హులైన పేదలకు ప్రతి 15 రోజులకు ఒకసారి నిరంతర ప్రక్రియగా ఆర్థిక సాయం అందిస్తున్నామని, కార్పొరేట్ వైద్యం పేదలకు భారం కాకూడదనే లక్ష్యంతో ఈ పథకం అమలవుతోందని వివరించారు.

## మంత్రి దామోదర రాజనర్సింహను కలిసిన ప్రభుత్వ విప్..

### - ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య..



యాదాద్రి భువనగిరి, ఆగస్టు 23 (జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణ రాష్ట్ర వైద్య , ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ , శాస్త్ర సాంకేతిక శాఖల మంత్రి దామోదర రాజనర్సింహని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ , ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య శని వారం రోజు హైదరాబాద్ ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి లడ్డు ప్రసాదాన్ని మంత్రి దామోదర రాజనర్సింహకి అందజేశారు. అనంతరం ఆలేరు నియోజకవర్గంతో పాటు యాదాద్రి భువనగిరి జిల్లాలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాలు , ముఖ్యంగా వైద్య , ఆరోగ్య రంగానికి సంబంధించిన అంశాలపై ఇరువురు చర్చించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మంత్రి దృష్టికి పలు అంశాలను తీసు కెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి సానుకూలంగా స్పందించి , ప్రజా సంక్షే మానికి సంబంధించిన అంశాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్ పాల్గొన్నారు.

## ఫార్మా ప్రమాద బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే

### - కుంభం అనిల్ కుమార్ రెడ్డి..



యాదాద్రి భువనగిరి, ఆగస్టు 23 (జర్నలిస్ట్ ఫైల్) : పోచంపల్లి మండలం దొతిగూడెంలోని హెజెలో ఫార్మా కంపెనీలో నిన్న రాత్రి రియాక్టర్ పేలుడు సంభవించి ఇద్దరు కార్మి కులు మృతి చెందిన ఘటన తీవ్ర విషాదాన్ని కలిగించింది. ఈ ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను శనివారం రోజు గాంధీ ఆసుపత్రిలో భువనగిరి శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి పరా మర్శించి వారికి ధైర్యం చెప్పారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.గతంలో కూడా ఈ కంపెనీలో ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకున్న నేపథ్యంలో ఘటనను ఎమ్మెల్యే కుంభం అనిల్ తీవ్రంగా పరిగణించారు. వెంటనే భువనగిరి జిల్లా కలెక్టర్ తో చరవాణిలో మాట్లాడి , ప్రమాదానికి గల కారణా లపై సమగ్ర విచారణ జరిపి , బాధ్యుల పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను ఖచ్చితంగా అమలు చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే యశోద , సన్‌రైజ్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న ప్రమాద బాధితుల ఆరోగ్య పరిస్థితి పై ఆరా తీసి , వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధితు లకు మెరుగైన వైద్యం అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉండటం తోపాటు , కంపెనీ యాజమాన్యం నుంచి తగిన ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో పోచంపల్లి నాయకులు పాక మల్లేష్ యాదవ్ , కళ్లెం రాఘవ రెడ్డి , సామా మోహన్ రెడ్డి , అంబరీష్ రెడ్డి పాల్గొన్నారు.

## అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడినోట్లో శని..

### - లీగల్ హెయిర్ సర్టిఫికెట్ కోసం వెళ్తే మహిళకు వేధింపులు..
### - మహిళను లొంగదీసుకోవాలని చూస్తున్న నల్లగొండ డీటీ..
### - పలువురిని కలచివేస్తున్న ఓ మహిళ ఉదంతం..



త్రిపురారం, ఆగస్టు 23 (జర్నలిస్ట్ ఫైల్) : అప్పుల బాధ తట్టుకోలేక త్రిపు రారం ఎంపీడీవో కార్యాలయం జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి మహేష్ ఆత్మహత్య చేసుకున్న ఉదంతం తెలిసిందే.. ఉద్యోగి చనిపోయిన తర్వాత కారుణ్య నియామకం కొరకు అతని భార్య ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం నల్లగొండ ఎంఆర్ఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోగా ఫైల్ ను విసిరి పడేశారు డిప్యూటీ తహసిల్దార్... ఈ క్రమంలో 9 నెలల నుండి ఎమ్మార్వో కార్యాలయం చుట్టూ బాధితురాలిని తిప్పుకుంటున్నారు రెవెన్యూ అధికారులు.. సంబంధం లేని వ్యక్తులను ఫ్యామిలీ మెంబర్‌గా చేర్చాలని డిప్యూటి తాసిల్దార్ ఆర్డర్ వేశాడు.. అంతేకాకుండా ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కావాలంటే తనకు లొంగాలని హుకుం జారీ జారీ చేశాడని బాధితురాలు ఆరోపించారు.. కాగా ఆర్డిఓ కార్యాలయం బయట సదురు మహిళపై డిప్యూటీ తహశీల్దార్ తన సొంత పిన్నితో దాడి చేయించినట్లు తెలుస్తోంది.. ఈ క్రమంలో సదరు డిప్యూటీ తహసిల్దార్ పై కలెక్టర్‌కు బాధితురాలు ఫిర్యాదు చేశారు.. 9 నెలలు కావస్తున్న ఇప్పటికి తనకు ఫ్యామిలీ సర్టిఫికెట్ తీయకుండా తిప్పుకుంటున్న డిప్యూటీ తహసిల్దార్ పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని బాధితురాలు విజ్ఞప్తి చేస్తున్నారు..

## ఉచిత కంటి వైద్య శిబిరం.. లబ్ధిదారులకు అద్దాల పంపిణీ..



నల్గొండ ఆగస్టు 23 (జర్నలిస్ట్ ఫైల్) : నకిరేకల్ పట్టణ ప్రభుత్వ ఆసుపత్రిలో ఉద్దీపన ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో చికిత్స పొందిన లబ్ధిదారులకు ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం కంటి అద్దాలను పంపిణీ చేశారు... ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్య పరిరక్షణే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. నకిరేకల్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఉచిత కంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజలకు అవసరమైన వైద్య సేవలు అందిస్తామని తెలిపారు.అవసరమైన వారికి కంటి పరీక్షలు, చికిత్సలు అందించడంతో పాటు, అవసరాన్ని బట్టి ఆపరేషన్లు నిర్వహించి కంటి అద్దాలను కూడా ఉచితంగా అందించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వైద్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యాదాద్రిలో వైభవంగా నిత్యకళ్యాణం..

### - ఉదయం ప్రభాత సేవ, సుదర్శన నారసింహ హోమం..



యాదగిరిగుట్ట, ఆగస్టు 23 (జర్నలిస్ట్ ఫైల్) : ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శనివారం నిత్య కైంకర్యాలలో భాగంగా స్వామి, అమ్మవార్లకు వైభవంగా నిత్య కళ్యాణం నిర్వహించారు ఆలయ అర్చకులు. ఉదయం స్వామి అమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపి సహస్రనామార్చన సుదర్శన హోమం వేదమత్ర యుక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లకు నిత్యకల్యాణం ఘనంగా నిర్వహించారు ఆలయ అర్చకులు. ఉదయం స్వామి అమ్మవార్లను పంచామృతాలతో ఆలయ అర్చకులు చదివే పంచసూక్తాలు ఉప నిషత్తులు దశశాంతులతో సుమారు రెండు గంటల పాటు అభిషేకం నిర్వహించారు. అనంతరం పట్టు వస్త్రాలను ధరింపజేశారు. వివిధ పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. సుదర్శన హోమంలో లక్ష్మి, గరుడ, ఆంజనేయం, సుదర్శనం, వంటి దేవత మంత్రాలతో హవనం నిర్వహిం చారు. అలాగే సాయంత్రం వెండి జోడు సేవలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు శ్రీకాంత్, రాకేష్, మురళీ ఏఈఓ సురేందర్ రెడ్డి, అధికారులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ షాపులో ప్రమాదకర మందులు విక్రయిస్తే కఠిన చర్యలు

- ◆ మాదక ద్రవ్యాల నిర్మూలనకు చర్యలు చేపట్టాలి
- ◆ యాంటీ డ్రగ్ కమిటీలను క్రియాశీలం చేయాలి
- ◆ జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి..
- ◆ కమాండ్ కంట్రోల్ వ్యవస్థ ద్వారా సీసీటీవీ నిఘాను మరింత బలోపేతం చేస్తున్నాం
- ◆ జిల్లా ఎస్పీ డి సునీతారెడ్డి..



వనపర్తి, ఆగస్టు 23 (జర్నలిస్ట్ ఫైల్) : వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా మెడికల్ దుకాణాల్లో ప్రమాదకర మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి హెచ్చరించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ డి సునీతారెడ్డితో కలిసి ఎన్‌కార్డ్ కమిటీ (మాదక ద్రవ్యాల నిరోధక సమన్వయ కమిటీ సమావేశం), రోడ్డు భద్రత టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణకు చేపడుతున్న చర్యలను సమీక్షించారు.

**ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ..**

జిల్లాలో మాదక ద్రవ్యాల వినియోగానికి సంబంధించిన ఘటనలు నమోదు కాకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా డిగ్రీ కళాశాలలు, మెడికల్ కళాశాల, జేఎన్‌టీయూ తదితర విద్యాసంస్థలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.చిన్నారులకు కల్లు విక్రయించకుండా ఎక్సైజ్ అధికారులు కఠిన చర్యలు చేపట్టాలని సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగం, విక్రయాలపై నిరంతరం నిఘా ఉంచి, ఎక్కడైనా అక్రమ కార్యకలాపాలు గుర్తిస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా మందుల విక్రయాలపై తనిఖీలు..**

వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా ఆల్ప్రాజోలం, ట్రామడాల్ వంటి ప్రమాదకర మందులను విక్రయించే మెడికల్ షాపులపై ప్రత్యేక తనిఖీలు, దాడులు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా మందులు విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటివరకు జిల్లాలో 52 మెడికల్ షాపులపై దాడులు నిర్వహించగా, 12 షాపుల్లో నిబంధనల ఉల్లంఘనలు గుర్తించామని, అందులో 10 షాపుల లైసెన్సులు రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు.

**విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్ కమిటీలను క్రియాశీలం చేయాలి..**

అన్ని విద్యాసంస్థల్లో ఏర్పాటు చేసిన యాంటీ డ్రగ్ కమిటీలను వెంటనే పూర్తిస్థాయిలో క్రియాశీలకంగా పని చేసే విధంగా చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి నెలా కమిటీ సమావేశం నిర్వహించి, విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు ఆకర్షితులు కాకుండా ముందస్తు అవగాహన కల్పించడంతో పాటు, అనుమానాస్పద కార్యక లాపాలు గుర్తించినప్పుడు సంబంధిత అధికారులకు సమాచారం అందించేలా విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించాలని సూచించారు.

**రోడ్డు భద్రతా చర్యలు పటిష్టం చేయాలి..**

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు జాతీయ రహదారులపై ఆక్రమణలు, అనధికార పార్కింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జాతీయ రహదారుల అధికారులను ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించే వారికి చలాన్లు, జరిమానాలు విధించాలని, అయినప్పటికీ నిబంధనలు పాటించని వారిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయాలని సూచించారు. కొత్తకోట ప్రాంతంలో జాతీయ రహదారి సంస్థ ప్రమాదాల నివారణలో భాగంగా ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌ను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. లారీలు, ఇతర ట్రాన్స్‌పోర్టర్లు పార్కింగ్ సదుపాయాలను వినియోగించేలా ఫుడ్ పిరమిడ్ పార్కింగ్ స్థలం వద్ద స్పష్టమైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలను తప్పనిసరిగా అమలు చేయాలని, జాతీయ రహదారులతో పాటు అంతర్గత రహదారులు కూడా సురక్షితంగా ఉండేలా అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

**మాదక ద్రవ్యాల నియంత్రణకు చర్యలు..**

**జిల్లా ఎస్పీ డి సునీతారెడ్డి..**

మాదక ద్రవ్యాల నియంత్రణలో భాగంగా ప్రతిరోజూ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అన్ని విద్యాసంస్థల్లో ఇప్పటికే యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేసినప్పటికీ అవి పూర్తి స్థాయిలో క్రియాశీలంగా లేవని, ఈ నెల నుంచి యాంటీ డ్రగ్ కమిటీలను పూర్తిస్థాయిలో క్రియాశీలం చేసి, విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో కమాండ్ కంట్రోల్ వ్యవస్థ ద్వారా సీసీటీవీ నిఘాను మరింత బలోపేతం చేస్తున్నామని ఎస్పీ తెలిపారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగంపై నిఘా పెంచి, అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో డిసిఆర్బి డిఎస్పి బాలాజీ నాయక్, డిటిఓ సురేష్, ఆర్ అండ్ బి ఈ ఈ, డీ ఎంహెచ్ఓ భాస్కర్ నాయక్, జాతీయ రహదారుల అధికారులు, సంబంధిత శాఖల అధికారులు,పాల్గొన్నారు.

# రసాయన పరిశ్రమలో రియాక్టర్ పేలుడు...

### - ఇద్దరు మృతి..8 మందికి గాయాలు



యాదాద్రి భువనగిరి ఆగస్టు 23 (జర్నలిస్ట్ ఫైల్) : భూదాన్ పోచంపల్లి కంపెనీలోని రియాక్టర్ పేలి ఇద్దరు కార్మికులు అక్కడి కక్కడే మృతి చెందారు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండల పరిధిలోని దోతి గూడెం గ్రామంలో గల హై జోలో లాబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో శు క్రవారం రోజు అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే నల్లగొండ జిల్లా పెద్దాపూర్ మండలం చిన్న గూడెం గ్రామానికి చెందిన చెన్ను నాగిరెడ్డి (31) , ఖమ్మం జిల్లా చౌదారంకు చెందిన నాగన బోయిన నరేష్ కుమార్ (29) లు స్థానిక హేజీలో కంపెనీలో పని చేస్తున్నారు. శుక్రవారం అర్ధరాత్రి షిఫ్ట్ మారే సమయంలో ఒక్కసారిగా రియాక్టర్ పేలడంతో ఇద్దరు కార్మికులు అక్కడి కక్కడే మృతి చెందారు.

మరో ఇద్దరి పరిస్థితి అత్యంత విషమంగా ఉండగా , ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమయంలో పరిశ్రమలో నైట్ షిఫ్ట్ మంది కార్మికులు పని చేస్తున్నారు. దాదాపు 12 అర్ధరాత్రి ఒక్కసారిగా భారీ శబ్దంతో రియాక్టర్ పేలి పోవడంతో కంపెనీలో భారీగా మంటలు ఎగిసి పడ్డాయి. ఆ శబ్దానికి తీవ్ర భయాందోళనలకు గురైన గ్రామస్తులు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఒక్కసారిగా రియాక్టర్ పేలడంతో కంపెనీ నుంచి దట్టమైన పొగ , భయంకరమైన విషవాయువు వెలు బడింది. దీంతో గ్రామస్తు లంతా ఉక్కిరిబిక్కిరి అయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే చౌటుప్పల్ డీఎస్పీ మధు సూదన్ రెడ్డి , చౌటుప్పల్ రూరల్ సీఐ సతీష్ రెడ్డి , పోచంపల్లి ఎస్సై జగన్ ఘటనా స్థలానికి చేరు కుని సహాయక చర్యలు చేపట్టారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తీసు కొచ్చారు. గాయపడిన క్షతగాత్రులను యాజ మాన్యం అంబులెన్స్ ద్వారా హైదరాబాద్ లోని రెండు ప్రైవేట్ ఆసుపత్రు లకు తరలించారు.

**గత జులై నెలలో ఒకరు మృతి...**

జూలై 16 న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లా సింగనమల్లు మండలం ఉల్లికల్లు గ్రామానికి చెందిన కెమిస్ట్ ఉద్యోగి ఆలమూరు కృష్ణా రెడ్డి (43) ఇదే కంపెనీలో పని చేస్తుండగా రియాక్టర్‌లో పడి ఊపిరాడక అక్కడి కక్కడే మృతి చెందాడు.

నెల రోజులు గడవక ముందే మరో ఇద్దరు కార్మికులు మృతి చెందడం చర్చ నీయాంశంగా మారింది. తరచుగా షిఫ్ట్ మారే సమయంలోనే ప్రమాదాలు జరుగు తున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

### బస్వాపురం ప్రాజెక్టులో నిల్వ ఉన్న నీటిని వదిలి

## ఎండిపోతున్న పంట పొలాలను కాపాడాలి



వలిగొండ, ఆగస్టు 23 (జర్నలిస్ట్ ఫైల్) : 25 బస్వాపురం ప్రాజెక్టులో ప్రస్తుతం నిల్వ ఉన్న నీటిని వదిలి బునాది గాని చెరువు ద్వారా వలిగొండ మండలం లో ఎండిపోతున్న పంట పొలాలను రక్షించాలని సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, మండల కార్యదర్శి వర్గ సభ్యులు మెరుగు వెంకటేశం,కందడి సత్తిరెడ్డి లు డిమాండ్ చేశారు

మండల పరిధిలోని కేర్చుపల్లి,మొగిలి పాక,తుర్కపల్లి గ్రామాల్లో ఆగస్టు 29,30,31 తేదీల్లో నిర్వహించనున్న సిపిఎం పాదయాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బస్వాపురం ప్రాజెక్టులో నిల్వఉన్న నీరు విడుదల చేయడం ద్వారా భువనగిరి,వలిగొండ మండలాలతో పాటు ఆత్మకూరు,మోత్కూర్,అడ్డగూడూర్ మండలాలకు చెందిన పంట పొలాలకు నీరు అందుతుందని వెంటనే నీటిని విడుదల చేసి బునాదిగాని కాలువ ద్వారా రైతాంగానికి అందించాలని డిమాండ్ చేశారు ఇప్పటికే వర్షాభావ పరిస్థితి ఏర్పడడంతో పాటు వేలాది రూపాయల ఖర్చులతో పంట పొలాలను వేసుకున్న రైతులకు భూగర్భ జలాల కొరతతో నీరందక పంట పొలాలు ఎండిపోతున్నాయని వెంటనే ప్రభుత్వం స్థానిక భువనగిరి ఆలేరు ఎమ్మెల్యేలు స్పందించి నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు ఈనెల 29,30,31 తేదీల్లో భువనగిరి నుండి హైదరాబాద్ ఇందిరా పార్క్ వరకు జరుగు పాదయాత్ర, మహాధర్నాలో రైతాంగం పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు . ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు మొగిలి పాక గోపాల్, దయ్యాల మల్లేశం, పలుసం స్వామి,జక్క రాఘవరెడ్డి, కందగట్ల సాయి రెడ్డి, సల్ల ఐలయ్య, తుమ్మల సంజీవరెడ్డి,లోడే మల్లేశం,తుమ్మల నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్ విజయవంతానికి సమన్వయ సమావేశం



వలిగొండ, ఆగస్టు 23 (జర్నలిస్ట్ ఫైల్) : రామన్నపేట సీనియర్ సివిల్ జడ్జి కోర్టు హాలులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహణకు సంబంధించి సమన్వయ సమావేశం నిర్వహించారు. 2026 సెప్టెంబర్ 12వ తేదీ శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్న నేపథ్యంలో, అధిక సంఖ్యలో కేసులను రాజీ మార్గంలో పరిష్కరించి, కక్షిదారులకు త్వరితగతిన న్యాయం అందించాలనే ఉద్దేశంతో ఈ సమావేశం ఏర్పాటు చేశారు.

ఈ సమావేశానికి జి. సవిత, సీనియర్ సివిల్ జడ్జి-కమ్-చైర్మన్, మండల న్యాయ సేవా కమిటీ, రామన్నపేట అధ్యక్షత వహించారు. సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్. శిరీష, అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి. రత్నకుమారి, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ జడ్జి డి. సత్యయ్య పాల్గొన్నారు.జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన కేసులను గుర్తించి, సంబంధిత పక్షాలతో సమన్వయం చేసుకొని వీలైనన్ని ఎక్కువ కేసులను స్నేహపూర్వకంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సమావేశంలో చర్చించారు. లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారం వల్ల సమయం, వ్యయం ఆదా కావడంతో పాటు కక్షిదారులకు త్వరితగతిన న్యాయం లభిస్తుందని అధికారులు పేర్కొన్నారు.ఈ సమావేశానికి రామన్నపేట సబ్-ఇన్‌స్పెక్టర్, మోత్కూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌తో పాటు కోర్టు కానిస్టేబుళ్లు హాజరయ్యారు. జాతీయ లోక్ అదాలత్ విజయవంతంగా నిర్వహించేందుకు న్యాయశాఖ, పోలీసు శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని, కేసుల పరిష్కారానికి అవసరమైన సహకారం అందించాలని సమావేశంలో సూచించారు.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేసి, ఎక్కువ సంఖ్యలో కేసులను రాజీ ద్వారా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు, న్యాయవాదులు మరియు కక్షిదారులు సహకరించాలని మండల న్యాయ సేవా కమిటీ, రామన్నపేట కోరింది.

# జేఏసీ ఉద్యోగుల సమీక్ష సమావేశం...

- 27న కలెక్టరేట్ లో వేలాది మంది ఉద్యోగులతో మహాధర్నా.
- సెప్టెంబర్ 10న చలో హైదరాబాద్
- ప్రతి ఉద్యోగి పాల్గొని విజయవంతం చేయాలి
- ఈహెచ్‌ఎస్‌ను అమలు చేసి నగదు రహిత వైద్య సేవలు అందించాలి
- పిఆర్సి నివేదికను తెప్పించి అమలు చేయాలి
- ఉద్యోగులకు రావాల్సిన 6 పెండింగ్ డీఏలను ఒకేసారి విడుదల చేయాలి
- కొత్త పెన్షన్ సిపిఎస్ ను రద్దు చేసి ఓపిఎస్‌ను అమలు చేయాలి
- పెన్షనర్లకు ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి



యాదాద్రి భువనగిరి ఆగస్టు 23 (జర్నలిస్ట్ ఫైల్) : యాదాద్రి భువనగిరి జిల్లా ఉద్యోగ ఉపాధ్యాయ గెజిటడ్ కార్మిక పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం చేపట్టబోయే ఆందోళన కార్యక్రమాలని విజయవంతం చేయాలని శనివారం రోజు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సన్నాహక సమావేశ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగినది. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ మందడి ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం పదేపదే హామీ ఇస్తున్న సమస్యల అమలుకు నోచుకోలేక అనేకసార్లు వేచి చూడాల్సి వస్తుంది. చివరిగా రాష్ట్ర సీఎం స్వయంగా ఉద్యోగ సంఘాలను పిలిచి సుమారు 3:00 గంటల పాటు చర్చలు జరిపి స్వయంగా హామీ ఇచ్చినప్పటికి నేటి వరకు ఎలాంటి అమలుకు నోచుకోలేదు. అందువలనే ఉద్యోగులు ఈనెల 27న పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమానికి పిలుపు నివ్వడం జరిగింది. సీఎం ఆదేశాల మేరకు మా సమస్యలను వెంటనే అమలు పరచాలని జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. సెప్టెంబర్ 10వ తేదీన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వ హించాలని సన్నాహక సమావేశంలో తీర్మా నించినది. ఈ కార్యక్రమం లో యాదాద్రి భువనగిరి జిల్లా ఉద్యోగ జెఏసి చైర్మన్ మందడి ఉపేందర్ రెడ్డి , ఎం.డి.ఖదీర్ , కె. శ్రీకాంత్ , పెండెం శ్రీనివాస్ , కె.మోహన్ రెడ్డి , అమరేందర్ రెడ్డి , ఎం. యాదయ్య , ఆర్. శైలజ , కె. ఆనంద్ , ఎం.డి అజీజ్ అలీ ఖాన్ , పి. శ్రీకాంత్ రెడ్డి , వి. అశోక్ కుమార్ , కె. వినోద్ రెడ్డి , మొయిజున్నిసా బేగం , ఎన్. లక్ష్మీ నరసింహ రెడ్డి , మెహతాబ్ సైదులు , గణ గాని శశికాంత్ గౌడ్ , పి. శ్రీకాంత్ , బి. శ్రీనివాస , రాజు , బోయ రాములు, జి. లింగయ్య , జి. శ్రీనివాస్ , కె. రమేష్ , వి. నరేందర్ , కె. యశోద , ఎం. కృష్ణ , బి. బాలరాజు తదితర ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తు కోసం విద్యా వాలంటీర్ల వ్యవస్థ ఏర్పాటు

- 35 మంది విద్యా వాలంటీర్లతో విజయవంతమైన ప్రయోగం.. ఇప్పుడు 100 మంది విద్యా వాలంటీర్లతో మరింత విస్తరణ
- దేశానికి ఆదర్శంగా శతశాతం కార్యక్రమం
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి
- శతశాతం అద్భుతమైన కార్యక్రమం కలెక్టర్ ఖుష్బూ గుప్తా



**దేవరకద్ర, ఆగస్టు 23 (జర్నలిస్ట్ ఫైల్) :** విద్యార్థులను సరైన మార్గంలో నడిపించడంలో సమాజంలోని ప్రతి ఒక్కరికీ బాధ్యత ఉందన్నారు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తన సొంత నిధులతో నిర్వహిస్తున్న శతశాతం కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఐడీఓసీ సమావేశ మందిరంలో నూతనంగా నియమించిన విద్యా వాలంటీర్ల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లలను చిన్న వయస్సు నుంచే గమనిస్తూ వారి ఆలోచనా విధానం, ప్రవర్తన, చదువుపై ఆసక్తి వంటి అంశాలను పరిశీలించాలని సూచించారు. సరైన సమయంలో పిల్లలపై దృష్టి పెట్టకపోతే వారు చెడు మార్గం వైపు వెళ్లే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. ఈ నేపథ్యంలోనే విద్యా వాలంటీర్ల వ్యవస్థను ప్రత్యేకమైన బాధ్యతతో రూపొందిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. విద్యా వాలంటీర్లు కేవలం పాఠాలు చెప్పడానికే పరిమితం కాకుండా విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు వస్తున్నారా, హోంవర్క్ చేస్తున్నారా, ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తున్నారా, వారి ప్రవర్తన ఎలా ఉంది, చదువులో ఏమైనా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా అనే అంశాలను నిరంతరం గమనించాలని సూచించారు. ఉపాధ్యాయులకు సిలబస్ పూర్తి చేయడం, పాఠ్య ప్రణాళికలు రూపొందించడం, పరీక్షలు నిర్వహించడం, ప్రభుత్వానికి సంబంధించిన వివిధ నివేదికలు సమర్పించడం వంటి అనేక బాధ్యతలు ఉంటాయని చెప్పారు. అలాంటి సమయంలో విద్యా వాలంటీర్లు విద్యార్థులను ప్రత్యేకంగా గమనించి వారి ప్రతిభ, సమస్యలు, ఆలోచనా విధానం వంటి అంశాలను ఉపాధ్యాయులతో పంచుకోవడం ద్వారా విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయవచ్చన్నారు. విద్యార్థులకు చిన్న వయస్సు నుంచే సబ్జెక్టుపై అవగాహన, కాన్సెప్ట్‌పై పట్టు కల్పించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే అన్నారు. అందుకే 3డీ యానిమేషన్లు, డిజిటల్ లెర్నింగ్, యానిమేటెడ్ పుస్తకాలు, డిజిటల్ బోర్డులు వంటి ఆధునిక పద్ధతులను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు. సాంకేతికతను విద్యలో సమర్థవంతంగా వినియోగించడం వల్ల విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి, ఆలోచనా శక్తి పెరుగుతుందని చెప్పారు. ప్రయోగాత్మక విధానాల ద్వారా పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం కూడా మెరుగుపడిందని పేర్కొన్నారు. విద్యా వ్యవస్థలో చిన్నచిన్న మార్పులు తీసుకురావడం ద్వారా విద్యార్థుల్లో చదువుపై ఆసక్తిని పెంచవచ్చని, అందుకే మూస పద్ధతులకు భిన్నంగా పరిశోధనాత్మకంగా, నిరూపితమైన విధానాలను అమలు చేస్తున్నామని తెలిపారు. విద్యా వాలంటీర్ల కార్యక్రమాన్ని తొలుత 35 మందితో నిర్వహించి మంచి ఫలితాలను సాధించామని తెలిపారు. ఆ విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని ప్రస్తుతం 100 మంది విద్యా వాలంటీర్లతో మరింత విస్తృత స్థాయిలో కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. మహబూబ్‌నగర్‌లో ప్రారంభించిన ఈ మోడల్ భవిష్యత్తులో రాష్ట్రస్థాయి, దేశస్థాయి మోడల్‌గా నిలవాలన్నదే తమ లక్ష్యమన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు మెరుగైన విద్య అందించి వారి భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు ఈ కార్యక్రమాన్ని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. విద్యా వాలంటీర్ల శిక్షణ కార్యక్రమాలకు సబ్జెక్ట్ నిపుణులు, ఉపాధ్యాయులు ఎంతో దూరం నుంచి వచ్చి శిక్షణ అందించారని ఆయన తెలిపారు. తెల్లవారు జామునే ప్రయాణించి శిక్షణా శిబిరాలకు హాజరై విద్యార్థులకు బోధించి, వారి సందేహాలను నివృత్తి చేస్తున్న నిపుణులు, ఉపాధ్యాయుల సేవలను ఆయన అభినందించారు. “మన పిల్లల భవిష్యత్తుకోసం మనంచేస్తున్న కార్యక్రమంగా భావించి ఉపాధ్యాయులు, విద్యా వాలంటీర్లు, సబ్జెక్ట్ నిపుణులు అందరూ సంపూర్ణ సహకారం అందించారని, ఈ సమిష్టి కృషితో మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో నిర్వహిస్తున్న విద్యా వాలంటీర్ల వ్యవస్థ మోడల్‌ను దేశానికి ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేస్తాం” అని అన్నారు. జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ విద్యా వాలంటీర్ల కార్యక్రమం ఒక అద్భుతమైన కార్యక్రమమని అన్నారు. నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఫలితాలు ఒక్క రోజులో సాధ్యం కావని, అయితే ఫలితాలు వచ్చినప్పుడు అవి ఎంతో గొప్ప అనుభూతి అందిస్తాయని చెప్పారు. ఒక గ్రామం నుంచి ప్రారంభమయ్యే విద్యా విప్లవం మండలం, జిల్లా, రాష్ట్రం, దేశం మొత్తం అభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు. మహిళలను విద్యా వాలంటీర్లుగా నియమించడం ద్వారా నియోజకవర్గంలో విద్యా వ్యవస్థ మరింత పటిష్టంగా, సురక్షితంగా ఉంటుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ శ్రీమతి గుమ్మాల మమత శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి, మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్, సీఎంఓ సుధాకర్ రెడ్డి, వందేమాతరం ఫౌండేషన్ కోఆర్డినేటర్ రవీందర్ రెడ్డి, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, వివిధ ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం

- అలంపూర్ నియోజకవర్గంలో అర్హులైన లబ్ధిదారులకు కార్డుల అందజేత
- డిజిటల్ కార్డులతో రేషన్ పంపిణీలో పారదర్శకత



**గద్వాల, ఆగస్టు 23 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం అలంపూర్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో శనివారం ప్రారంభమైంది. అలంపూర్ తహశీల్దార్ కార్యాలయంతో పాటు మున్సిపాలిటీ, ఎర్రవల్లి మండలం షేక్‌పల్లి గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. అలంపూర్ తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో తహశీల్దార్ ప్రభాకర్, మున్సిపల్ కౌన్సిలర్లు పద్మావతి, మల్లెపోగు జమ్మన్న, రాజ్యలక్ష్మి సురేష్, టి.ఈరమ్మ మద్దిలేటి, వసుంధర సుందర్ రాజు తదితరులు పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు నూతన కార్డులను అందజేశారు. నాయకులు సుందర్ రాజు, రజిని బాబు, జాన్ తదితరులతో పాటు రెవెన్యూ అధికారులు, సిబ్బంది, వార్డు ప్రతినిధులు, స్థానిక నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. అలంపూర్ మున్సిపాలిటీలోనూ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎంఆర్ఓ ప్రభాకర్, మున్సిపాలిటీ 3వ వార్డు కౌన్సిలర్ నవాబ్ ఆసిఫ్ ఖాన్ లబ్ధిదారులకు కార్డులను అందజేశారు. నూతన స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా కుటుంబ వివరాలు, రేషన్ పొందే ప్రక్రియ మరింత సులభతరం, పారదర్శకంగా మారుతుందని అధికారులు తెలిపారు. ఆధునిక సాంకేతికత, క్యూఆర్ కోడ్, డిజిటల్ ధ్రువీకరణతో కూడిన కార్డుల వల్ల రేషన్ పంపిణీలో అక్రమాలకు అవకాశం తగ్గుతుందని పేర్కొన్నారు.

**షేక్‌పల్లిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ..**

ఎర్రవల్లి మండలం షేక్‌పల్లి గ్రామంలోనూ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ వెంకటలక్ష్మమ్మ చేతుల మీదుగా అర్హులైన లబ్ధిదారులకు కార్డులను అందజేశారు. కార్యక్రమంలో జీపీఓ రామేశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్ర, రేషన్ డీలర్ వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు. స్మార్ట్ రేషన్ కార్డు డెబిట్ కార్డు పరిమాణంలో ఉండటంతో సులభంగా వెంట తీసుకెళ్లవచ్చని, క్యూఆర్ కోడ్, డిజిటల్ ధ్రువీకరణ వంటి సాంకేతిక సదుపాయాలతో రేషన్ పంపిణీలో పారదర్శకత పెరుగుతుందని అధికారులు తెలిపారు. రేషన్ పొందడంతో పాటు ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ, గ్యాస్ సబ్సిడీ తదితర సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందేందుకు కూడా ఈ కార్డు ఉపయోగపడుతుందని వివరించారు.

# బాలల హక్కులు, భద్రతపై విద్యార్థులకు న్యాయ అవగాహన

- పోక్సో, బాల్య వివాహాల నిషేధ చట్టాలపై అవగాహన
- ఆన్‌లైన్ భద్రత, సైబర్ వేధింపులపై విద్యార్థులకు సూచనలు
- లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్స్ వి.రాజేందర్, డి.లక్ష్మణ స్వామి



**గద్వాల, ఆగస్టు 23 (జర్నలిస్ట్ ఫైల్) :** బాలల సంక్షేమం, రక్షణకు సంబంధించిన చట్టాలు, పథకాలపై విద్యార్థులకు అవగాహన కల్పించే ఉద్దేశంతో జిల్లా న్యాయ సేవా సంస్థ, జోగులాంబ గద్వాల ఆధ్వర్యంలో గద్వాల మండలం అనంతపూర్ గ్రామంలోని పీఎం శ్రీ జడ్.పి.హెచ్.ఎస్ లో శనివారం న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్స్ వి.రాజేందర్, డి.లక్ష్మణ స్వామి పాల్గొని విద్యార్థులకు బాలల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, పోక్సో చట్టం--2012, బాల్య వివాహాల నిషేధ చట్టం--2006, బాల కార్మికుల నిషేధం మరియు నియంత్రణ చట్టం, విద్యా హక్కు చట్టం--2009, జువెనైల్ జస్టిస్ చట్టం--2015 తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రతి చిన్నారి సురక్షితమైన, హింస రహిత వాతావరణంలో జీవించే హక్కు కలిగి ఉంటుందని తెలిపారు. విద్యార్థులు వేధింపులు, హింస లేదా ఇతర ఇబ్బందులు ఎదుర్కొంటే భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, ఉచిత న్యాయ సహాయం కోసం నాల్సా టోల్‌ఫ్రీ నంబర్ 15100ను వినియోగించుకోవచ్చని వివరించారు. గుడ్ టచ్--బ్యాడ్ టచ్, వ్యక్తిగత భద్రత, బాలల హక్కులు, ఆన్‌లైన్ భద్రత, సైబర్ వేధింపులు, సోషల్ మీడియా బాధ్యతాయుత వినియోగం, విద్య ప్రాముఖ్యత తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అపరిచితులతో వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, ఇతర సున్నితమైన సమాచారాన్ని పంచుకోకూడదని సూచించారు.



**మొబైల్ లోక్ అదాలత్ ద్వారా అవగాహన..**

మొబైల్ లోక్ అదాలత్--ఉచిత న్యాయ సేవల బస్సు ద్వారా దృశ్య ప్రదర్శనలు, వీడియోల సహాయంతో బాలల హక్కులు, చట్టాలు, భద్రత, రక్షణ, ఉచిత న్యాయ సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సోషల్ మీడియా, ఇంటర్నెట్‌ను జాగ్రత్తగా వినియోగించాలని, సైబర్ వేధింపులు ఇతర సమస్యలు ఎదురైనప్పుడు వెంటనే విశ్వసనీయ పెద్దలు, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస గౌడ్, భరోసా సెంటర్ ప్రతినిధి కె.ఆమాని, ఐసీపీఎస్ కౌన్సిలర్ సురేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధులకు అండగా న్యాయ సేవా సంస్థ

- చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎం. మధుసూదన్‌రావు

**కల్వకుర్తి, ఆగస్టు 23 (జర్నలిస్ట్ ఫైల్) :** వృద్ధాప్యంలో ఆత్మీయత, భరోసా ఎంతో అవసరమని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎం. మధుసూదన్‌రావు అన్నారు. వృద్ధులు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నా జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ప్రపంచ సీనియర్ సిటిజన్స్ డే సందర్భంగా రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ, నాగర్ కర్నూల్ ఆధ్వర్యంలో శనివారం కల్వకుర్తి పట్టణంలోని డీడబ్ల్యూవో, పీబీఎస్‌ల సంయుక్త నిర్వహణలోని వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్, కార్యదర్శి ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీరామ్ ఆర్య, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ జి. పవన్ శేషసాయి పాల్గొన్నారు.



వృద్ధులతో ఆప్యాయంగా మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వారితో పాటలు పాడిస్తూ, సరదాగా గడుపుతూ ఉత్సాహపరిచారు. వృద్ధాప్యం జీవితంలో కీలక దశ అని, ఈ సమయంలో ఎవరూ ఒంటరితనానికి గురికాకుండా ఆహ్లాదకర వాతావరణంలో సంతోషంగా ఉండేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.వృద్ధులకు ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, న్యాయ సేవా సంస్థ ద్వారా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. అనంతరం వృద్ధులకు బిస్కెట్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమ నిర్వాహకురాలు పెరుమాళ్ల వెంకటయ్య, కోఆర్డినేటర్ బి. పద్మ, వృద్ధులు, సిబ్బంది పాల్గొన్నారు.ఖైదీలకు ఉచిత న్యాయసాయం అనంతరం మధుసూదన్ రావు, శ్రీరామ్ ఆర్య, పవన్ శేషసాయి కల్వకుర్తి సబ్‌జైలును సందర్శించారు. ఖైదీలతో మాట్లాడి వారి సమస్యలు, యోగక్షేమాలను తెలుసుకున్నారు. జైలు పరిసరాలను పరిశీలించడంతోపాటు ఖైదీలకు అందుతున్న భోజనం, మెనూ వివరాలను అడిగి తెలుసుకున్నారు. న్యాయవాదిని నియమించుకునే ఆర్థిక స్థోమత లేని ఖైదీలకు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ తరఫున ఉచితంగా న్యాయవాదిని నియమించి న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరికీ న్యాయం అందుబాటులో ఉండేలా న్యాయ సేవా సంస్థ నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జైలు అధికారులు, కోర్టు ఉద్యోగులు పాల్గొన్నారు.

## పెంచికలపాడుకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి

### - డిపో మేనేజర్‌కు సర్పంచ్ వినతి



**గద్వాల, ఆగస్టు 23 (జర్నలిస్ట్ ఫైల్) :** గట్టు మండలం పరిధిలోని పెంచికలపాడు గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ గ్రామ సర్పంచ్ కె.ఆంజనేయులు, ఉప సర్పంచ్ ముహమ్మద్ శనివారం డిపో మేనేజర్ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు, మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు. సర్పంచ్ కె.ఆంజనేయులు మాట్లాడుతూ.. గ్రామానికి నేరుగా ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక విద్యార్థులు ప్రతిరోజూ పెంచికలపాడు స్టేజీ వరకు కాలినడకన వెళ్లి, అక్కడి నుంచి బస్సులో గద్వాలకు వెళ్లి విద్యను అభ్యసించాల్సి వస్తోందన్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సును నేరుగా పెంచికలపాడు గ్రామంలోకి నడపాలని కోరారు. బస్సు సౌకర్యం కల్పిస్తే విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, మహిళలు, వృద్ధులు సహా గ్రామ ప్రజలందరికీ ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

## 22ఏ నిషేధిత భూముల జాబితాపై సమగ్ర విచారణ జరపాలి

### - తప్పిదాలు, అక్రమ చేర్పులపై వాస్తవాలు బహిర్గతం చేయాలి
### - బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు బీజేపీ వినతి



**గద్వాల, ఆగస్టు 23 (జర్నలిస్ట్ ఫైల్) :** జిల్లాలో 22ఏ నిషేధిత భూముల జాబితా రూపకల్పనలో జరిగిన తప్పిదాలు, అక్రమ చేర్పులు, అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను బహిర్గతం చేయడంతో పాటు బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు ఆధ్వర్యంలో నాయకులు శనివారం గద్వాల కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ.. తెలంగాణలో 22ఏ నిషేధిత భూముల జాబితా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం భూదోపిడీకి పాల్పడుతోందని ఆరోపించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్షమాపణలు చెప్పారంటేనే ఈ వ్యవహారంలో స్కాం జరిగినట్లు ప్రభుత్వం ఒప్పుకున్నట్లేనని వ్యాఖ్యానించారు. ఏళ్ల తరబడి భూములను సాగు చేసుకుంటున్న రైతులు, సామాన్య ప్రజలు 22ఏ జాబితా కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నిషేధిత భూముల జాబితాలో తప్పుగా చేర్చిన భూములను వెంటనే పరిశీలించి, అర్హులైన భూ యజమానులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. భూ రికార్డుల్లో జరిగిన మార్పులు, చేర్పులపై సమగ్ర విచారణ నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. 22ఏ పేరుతో అక్రమాలకు పాల్పడితే బీజేపీ ప్రజల తరఫున పోరాటం చేస్తుందని రామాంజనేయులు హెచ్చరించారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సమీక్ష నిర్వహించి, బాధితులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ అక్కల రమాదేవి, జిల్లా ప్రధాన కార్యదర్శి రవి కుమార్ ఎక్బోటే, పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ నరసింహ, జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు బాబుల్ రెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు దరూర్ కిష్టన్న, మైనార్టీ మోర్చా అధ్యక్షుడు మాలిమ్ ఇసాక్, కౌన్సిలర్ శాలన్న, చంద్రశేఖర్, మాజీ కౌన్సిలర్ శ్రీమన్నారాయణ, మండల అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, శ్రీనివాసులు, బీజేపీ సీనియర్ నాయకులు ఎర్ర భీంరెడ్డి, మధు గౌడ్, దరషెల్లీ, నర్సింహులు, రజక నరసింహ, అశోక్, జగదీష్ రెడ్డి, తిమన్న, బీజేవైఎం నాయకులు పాండు, సతీష్, సాయి, పవన్, కైఫ్ తదితరులు పాల్గొన్నారు.

## బీచుపల్లి ఆంజనేయస్వామిని దర్శించుకున్న మాజీ ఎంపీ



**గద్వాల, ఆగస్టు 23 (జర్నలిస్ట్ ఫైల్) :** శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని మాజీ పార్లమెంట్ సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి శనివారం బీచుపల్లి శ్రీఆంజనేయస్వామి ఆలయాన్ని దర్శించు కుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకుని ప్రజలంతా సుఖ సంతోషాలతో, సుభిక్షంగా, ఆయురా రోగ్యాలతో జీవించాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు రావుల చంద్రశేఖర్ రెడ్డికి ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం శేషవస్త్రం అందజేసి సత్కరించారు. రావుల చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. బీచుపల్లి పుణ్యక్షేత్రం అత్యంత మహిమాన్వితమైన ఆధ్యాత్మిక క్షేత్రమని అన్నారు. శ్రీ ఆంజనేయ స్వామి తన ఇష్టదైవమని, స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, సౌభాగ్యంగా, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో జీవించాలని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కర్రీస్వామి, అశోక్, రాజశేఖర్, సాయిప్రసాద్, గోపిబాబు, డాక్టర్ ఆనంద్, అలిపీర్, సీతార, వెంకటేశ్వర్లు, వడ్డే రమేష్, టి.ఎన్.ఎల్లారెడ్డి, సందీప్, కానాయపల్లి మాజీ సర్పంచ్ యాదయ్య, కొత్తకోట బాలయ్య, టి. అమరేందర్, లక్ష్మణ్ గౌడ్, శివప్రసాద్ గౌడ్ పాల్గొన్నారు.

## అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

### - ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్



**నర్సంపేట, ఆగస్టు 23 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్), నర్సంపేటలో 2026--27 విద్యా సంవత్సరానికి అతిథి అధ్యాపక పోస్టుల భర్తీ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఏఈడిపి కోర్సులైనటువంటి బి.కాం. బీఎఫ్ఎస్ఐ మరియు బి.ఎస్సీ. హెల్త్‌కేర్ విభాగంలో ఖాళీగా ఉన్న ఒక్కొక్క అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు.సంబంధిత సబ్జెక్టు - బీకాం బిఎఫ్ఎస్ఐ బోధించడానికి ఎమ్ కాం పి.జి.బీఎస్సీ హెల్త్ కేర్ బోధించడానికి మైక్రో బయాలజీ, బయోటెక్నాలజీ, బయో కెమిస్ట్రీ, జువాలజీ లేదా బాటని సబ్జెక్టులలో పి.జి.లో, ఓసీ మరియు బీసీ అభ్యర్థులు కనీసం 55 శాతం మార్కులు, ఎస్సీ మరియు ఎస్టీ అభ్యర్థులు కనీసం 50 శాతం మార్కులు కలిగి ఉండాలని తెలిపారు. పీహెచ్‌డీ/నెట్/సెట్/స్లెట్ వంటి అదనపు అర్హతలతోపాటు సంబంధిత రంగంలో బోధన అనుభవం ఉన్న అభ్యర్థులకు ఎంపికలో ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు.అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ బయోడేటా, విద్యార్హతలు, అనుభవ ధ్రువపత్రాలు మరియు ఇతర సంబంధిత సర్టిఫికెట్ల నకళ్లతో ఈనెల 29 శనివారం సాయంత్రం 4:00 గంటలలోపు కళాశాల కార్యాల యంలో దరఖాస్తులను సమర్పించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

## మెడికల్ షాప్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



**గద్వాల, ఆగస్టు 23 (జర్నలిస్ట్ ఫైల్) :** గద్వాల నియోజకవర్గం ధరూర్ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన మెడ్‌ప్లస్ మెడికల్ షాప్‌ను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి శనివారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మెడికల్ షాప్‌ను సందర్శించి, మందుల కొనుగోలు చేశారు. ధరూర్ మండల కేంద్రంలో నూతనంగా మెడికల్ షాప్ ఏర్పాటు కావడంతో స్థానిక ప్రజలకు మందులు అందుబాటులోకి రానున్నాయని నిర్వాహకులు తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలకు అవసరమైన మందులు సకాలంలో లభించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు రమేష్ నాయుడు, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, మాజీ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ శ్రీధర్ గౌడ్, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, డి.వై. రామన్న, హనుమంత్ రెడ్డి, నాగన్న, అంజి సాగర్, జానీ, రాజేష్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# దుబాయ్‌లో తెలుగు యువకుడి మిస్టరీ మృతి - ఇండియాకు రాని మృతదేహం

సోన్, ఆగస్టు 23 (జర్నలిస్ట్ ఫైల్) :



సోన్ మండల కేంద్రంలోని దుబాయ్‌లో ఉపాధి కోసం వెళ్లిన తెలుగు యువకుడు దుండగుల గంగయ్య (39) మృతి చెందారు. అయితే ఆయన మృతదేహం ఇప్పటివరకు ఇండియాకు రాలేదు, ఆచూకీ కూడా తెలియలేదు.

వివరాలు:

కీవశేవ దుండగుల గంగయ్య గారు (జననం: 01-01-1986) దుబాయ్‌లో మిస్సింగ్ అయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ది. 11-08-2026న మరణించినట్లు సమాచారం అందినా, అప్పటి నుండి మృతదేహం జాడ తెలియడం లేదు.

స్నేహానికి, ప్రేమానురాగాలకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన గంగయ్య లేరన్న వాస్తవం మా గుండెల్ని పిండేస్తోందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనంత లోకాలకు వెళ్లిన ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

దుబాయ్‌లోని భారత రాయబార కార్యాలయం స్పందించి, మృతదేహాన్ని త్వరగా స్వదేశానికి రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. వారి కుటుంబం చాలా దయనీయ స్థితిలో ఉంది, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని చేతులు జోడించి తగిన న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

# రైతులకు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన




నల్లబెల్లి, ఆగస్టు 23 (జర్నలిస్ట్ ఫైల్) :

నల్లబెల్లి మండలం ఎర్ర చెరువు తండా, గోవిందపూర్ గ్రామాల్లో ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్, డబ్ల్యుడబ్ల్యుఎఫ్ ఇండియా ఆధ్వర్యంలో అధిక విషపురిత, నిషేధిత పురుగు మందుల వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు సేంద్రియ పద్ధతులపై అవగాహన కల్పించారు.పి.యు. మేనేజర్ శ్రీధర్ టీటీ మాట్లాడుతూ.. పంటలో పురుగులు కనిపించగానే వెంటనే పురుగు మందులు పిచికారీ చేయకుండా ముందుగా పంటను పరిశీలించాలని సూచించారు. పురుగుల ఉధృతి ఆర్థిక నష్ట పరిమితి స్థాయిని దాటినప్పుడు ముందుగా సేంద్రియ పద్ధతిలో కషాయాలు తయారు చేసుకుని పిచికారీ చేయాలని తెలిపారు. తప్పనిసరి పరిస్థితుల్లో పురుగు మందులు వినియోగించాల్సి వస్తే తక్కువ విషపురితమైన మందులకే ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.అనంతరం వావిలాకు కషాయం తయారీ విధానాన్ని రైతులకు వివరించి, కషాయాన్ని తయారు చేసి రైతులకు అందించారు. కార్యక్రమంలో ఫీల్డ్ స్టాఫ్ రాజేష్, భాస్కర్, వసంత, తరుణ్‌తో పాటు గ్రామ మహిళా రైతులు పాల్గొన్నారు.

# జస్టిస్ ఫర్ రూపారెడ్డి.. న్యాయం జరిగే వరకు పోరాటం




నిర్మల్‌జిల్లా, ఆగస్టు 23 (జర్నలిస్ట్ ఫైల్) :

నల్గొండ జిల్లా కొండమల్లేపల్లిలోని నాగార్జున పాఠశాల ప్రిన్సిపాల్ రూపారెడ్డిపై జరిగిన దారుణ దాడి, హత్యను నిరసిస్తూ తానూర్ మండల ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జస్టిస్ ఫర్ రూపారెడ్డి అనే నినాదంతో రోడ్డెక్కి ర్యాలీ నిర్వహించారు.

తానూర్ మండలంలోని ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, కరస్పాండెంట్లు, పాఠశాలల యాజమాన్యాల ప్రతినిధులు ర్యాలీలో పాల్గొన్నారు. రూపారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ మౌనం పాటించారు. ఆమెకు ఘనంగా నివాళులర్పించి, రూపారెడ్డికి న్యాయం చేయాలని నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ.. విద్యాబుద్ధులు నేర్పే ప్రిన్సిపాల్‌పై ఇలాంటి అమానుష దాడి చేసి హత్య చేయడం అత్యంత దారుణమని అన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు భద్రత కల్పించడంతో పాటు ఉపాధ్యాయులు, విద్యా సిబ్బందికి కూడా రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

రూపారెడ్డి హత్యకు పాల్పడిన నిందితులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించకుండా చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు మరోసారి జరగకుండా ప్రభుత్వం, పోలీసు, విద్యాశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.

ర్యాలీ అనంతరం రూపారెడ్డి హత్యకు బాధ్యులైన దోషులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక పోలీస్ స్టేషన్ అధికారులకు ఫిర్యాదు అందజేశారు. నిందితులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని పోలీసులను కోరారు.

కార్యక్రమంలో తానూర్ మండలంలోని వివిధ ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, కరస్పాండెంట్లు, యాజమాన్యాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# దళితబంధు సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కోలుగూరి నరేష్




**దళితబంధు సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా జమ్మికుంట పట్టణానికి చెందిన కోలుగూరి నరేష్ నియామకం**

**నియామక పత్రం అందించిన రాష్ట్ర దళితబంధు సాధన సమితి అధ్యక్షులు కొగిలా మహేష్**

హుజురాబాద్, ఆగస్టు 23 (జర్నలిస్ట్ ఫైల్) :

ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా దళిత బంధు సాధన సమితి కమిటీలను ఏర్పాటు చేస్తామని ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అవలంబిస్తున్న దళిత వ్యతిరేక విధానాలను ఊరూరా ప్రచారం చేస్తామని దళిత సంఘాలను కలుపుకొని ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని వారు తెలిపారు ఈ సందర్భంగా కోలుగూరి నరేష్ మాట్లాడు హుజురాబాద్ నియోజకవర్గంలో దళితబంధు రెండవ విడత నిధులు మంజూరు చేయాలనీ గత 2 సంవత్సరాలుగా అనేక పోరాటాలు చేసి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందడం చాలా ఆనందంగా ఉందని రానున్న రోజుల్లో రాష్ట్ర స్థాయిలో పోరాటం చేసే అవకాశం కల్పించిన రాష్ట్ర కమిటీ సభ్యులకు మరియు నా నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు కొగిలా మహేష్ అన్న గారికి ధన్యవాదలు తెలియజేసారు.

# స్వర్ణ ఆశ్రమ పాఠశాలకు మహిళా వార్డెన్‌ను నియమించాలి

## ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో డీటీడీవో కార్యాలయంలో వినతిపత్రం

నిర్మల్‌జిల్లా, ఆగస్టు 23 (జర్నలిస్ట్ ఫైల్) :



స్వర్ణ ఆశ్రమ బాలికల పాఠశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, హాస్టల్‌కు పూర్తిస్థాయి మహిళా వార్డెన్‌ను నియమించాలని ఎస్ఎఫ్ఐ నిర్మల్ జిల్లా కన్వీనర్ దిగంబర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో డీటీడీవో కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా దిగంబర్ మాట్లాడుతూ.. ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థినులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా బాలికల హాస్టల్‌లో పురుష వార్డెన్ బాధ్యతలు నిర్వహిస్తుండటంతో విద్యార్థినులు తమ వ్యక్తిగత, ఆరోగ్య సంబంధిత సమస్యలను చెప్పుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. బాలికల హాస్టల్‌కు మహిళా వార్డెన్‌ను నియమించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు.

హాస్టల్‌లో బాత్రూమ్‌లు, శౌచాలయాలు, తాగునీరు తదితర కనీస సౌకర్యాలు సరిగా లేక విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అపరిశుభ్రతతో పాటు అవసరమైన మరమ్మతులు చేపట్టకపోవడంతో సమస్యలు మరింత తీవ్రంగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

విద్యార్థినుల భద్రత, ఆరోగ్యం, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని తక్షణమే మహిళా వార్డెన్‌ను నియమించాలని, బాత్రూమ్‌లకు మరమ్మతులు చేపట్టి అదనపు శౌచాలయాలను అందుబాటులోకి తీసుకురావాలని, తాగునీరు, విద్యుత్, పరిశుభ్రమైన వాతావరణం వంటి కనీస వసతులను కల్పించాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది.

అధికారులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే విద్యార్థినుల భవిష్యత్తు, ఆరోగ్యం కోసం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని దిగంబర్ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కో-కన్వీనర్ నితిన్ పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో తీవ్ర అన్యాయం. స్మశానానికి స్థలం కూడా లేదు చెంచుల ధర్నా

సోన్, ఆగస్టు 23 (జర్నలిస్ట్ ఫైల్) :



సోన్ మండలం. మాదాపూర్ గ్రామానికి చెందిన చెంచు కుటుంబాలు తమకు జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ నిర్మల్ జిల్లా కేంద్రంలో ధర్నాకు దిగారు. 40 ఏళ్లుగా అ గ్రామంలోనే స్థిర నివాసం ఉంటున్నా ప్రభుత్వం తమను పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు మాదాపూర్ గ్రామంలోని కొత్త మరియు పాత పాలకవర్గం పట్టించుకోని తీరు, శవాన్ని తీసుకెళ్లడానికి కనీస స్థలంలో పట్టించుకోని పాత పాలకవర్గం కొత్త పాలకవర్గం,

మాదాపూర్ లో నివసిస్తున్న సుమారు చెంచు కుటుంబాలు తరతరాలుగా అక్కడే ఉంటున్నాయి. అయినప్పటికీ ఇప్పటివరకు తమకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సంక్షేమ ఫలాలు అందలేదని వారు వాపోయారు.

ఇందిరమ్మ ఇళ్లలో వివక్ష: గతంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, ఇప్పుడు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇస్తున్న ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో తమకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. అర్హులైన తమను పక్కన పెట్టి అనర్హులకు ఇళ్లు ఇస్తున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

స్మశాన వాటిక కూడా లేదు: తమకు చనిపోయిన తర్వాత అంత్యక్రియలు నిర్వహించుకోవడానికి కనీసం స్మశాన వాటిక స్థలం కూడా కేటాయించలేదని, దీంతో శవాన్ని తీసుకెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కన్నీరు పెట్టుకున్నారు.

కలెక్టర్ స్పందించడం లేదు: ఈ సమస్యలపై తాము ఎన్నోసార్లు నిర్మల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరిగామని, పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా అధికారుల నుంచి ఎలాంటి స్పందన రావడం లేదని ఆవేదన చెందారు.

చివరకు చేసేదేమీ లేక తమ గోడును ప్రభుత్వానికి తెలియజేయడానికి ధర్నా బాట పట్టినట్లు చెంచు కుటుంబ పెద్దలు తెలిపారు. తమకు వెంటనే ఇళ్లు, స్మశాన వాటికకు స్థలం కేటాయించి న్యాయం చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

# మహిళలు, చిన్నారుల భద్రతకే పెద్దపీట

సైబరాబాద్, ఆగస్టు 23 (జర్నలిస్ట్ ఫైల్) :




సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో మహిళలు, చిన్నారుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ పోలీసులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. బహిరంగ ప్రదేశాల్లో అసభ్యంగా ప్రవర్తిస్తున్న ఆకతాయిల భరతం పట్టేందుకు షీ టీమ్స్ 109 డికాయ్ ఆపరేషన్లు నిర్వహించి 18 మందిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని 17 పెట్టీ కేసులు నమోదు చేసి కౌన్సెలింగ్ ఇచ్చాయి. వివిధ మార్గాల్లో బాధితుల నుంచి అందిన 25 ఫిర్యాదులపై మరో మూడు కేసులు నమోదు చేయగా, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ దాడులు నిర్వహించి రెండు పిటా కేసుల్లో ఇద్దరు బాధితులను, జువైనల్ జస్టిస్ చట్టం కింద ఇద్దరు బాలురను రక్షించి మొత్తం ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసింది. విభేదాలతో విడిపోయే దశకు చేరుకున్న 32 జంటలకు కుటుంబ సలహా కేంద్రాల ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించి వారిని తిరిగి ఒక్కటి చేశారు. నేరాల నియంత్రణ, భద్రతా చట్టాలు, టోల్ ఫ్రీ నంబర్లపై 181, 1098, 100/112, 1930 సుమారు 4974 మందికి అవగాహన కల్పించడంతో పాటు, ఆగస్టు 20న గౌలిదొడ్డిలోని ద శ్రీరామ్ అకాడమీలో ఎస్సీఎస్సీతో కలిసి విద్యార్థులకు సైబర్ భద్రత, సామాజిక బాధ్యత, వ్యక్తిగత రక్షణపై ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీఎస్సీ డైరెక్టర్ రష్మి, షీ టీమ్స్ ఎస్ఐ వెంకటేష్, ముఖ్య అతిథి వనిత దాట్ల పాల్గొని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారని ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్ ఏసీపీ ఎస్.కృష్ణప్రసాద్ ఒక ప్రకటనలో వెల్లడించారు.

# గండికోట పర్యాటక ప్రాంతంలో పారిశుద్ధ్య నిర్వహణకు టెండర్లు:కలెక్టర్ డా శ్రీధర్ చెరుకూరి

కడప, ఆగస్టు 23 (జర్నలిస్ట్ ఫైల్) :



గండికోట పర్యాటక ప్రాం తంలో పారిశు ద్ధ్యం, సెప్టేజ్ సరఫరా, నిర్వహణ పనులను చేపట్టేందుకు సీల్డ్ టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. గండికోట పర్యాటక ప్రాంతంలో పారిశుద్ధ్య నిర్వహ ణ, సెప్టేజ్ సరఫరా, సంబంధిత నిర్వహణ పనులకు మొత్తం అంచనా విలువను రూ.8,40,000గా నిర్ణయించారు. టెండర్‌లో పాల్గొనే వారు రూ.50,000 ప్రాసెసింగ్ ఫీజును ఆన్‌లైన్ డీడీ రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. అలాగే రూ.5,00,000 ధరావతు సొమ్ము (ఈఎండీ)ను బ్యాంకు గ్యారంటీ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా సమర్పించాల్సి ఉంటుంది.టెండర్ ప్రక్రియను రెండు కవర్ల విధానంలో నిర్వ హించనున్నారు. ఇందులో సాంకేతిక బిడ్డు, ఆర్థిక బిడ్డులను వేర్వేరుగా సమర్పించాల్సి ఉంటుంది. టెండర్ పత్రాలను 2026 ఆగస్టు 21 నుంచి ఆగస్టు 28వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు సమర్పించేందుకు అవ కాశం కల్పించారు.పూర్తి చేసిన టెండర్ పత్రాలను జిల్లా పర్యాట క శాఖ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన టెండర్ బాక్స్‌లో వేయాలని అధికారులు సూచిం చారు. టెండర్‌కు సంబంధించిన పత్రాలు, ధ్రువపత్రాలను నిబం ధనల ప్రకారం సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు.ధరావతు సొమ్ము, సంబంధిత చెల్లింపుల కోసం Gandikota Tourism Development పేరుతో ట్రెజరీ బ్రాంచ్, కడపలో ఉన్న ఖాతా వివరాలను అధికారులు వెల్లడిం చారు. ఖాతా సంఖ్య 4338099 3050, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ SBIN0 011122గా పేర్కొన్నారు.టెండర్ ప్రక్రియలో వచ్చిన ప్రతిపాదనల ను పరిశీలించి టెండర్‌ను ఆమో దించే లేదా తిరస్కరించే అధి కారం జిల్లా కలెక్టర్‌కు ఉంటుం దని స్పష్టం చేశారు. టెండర్‌కు సంబం ధించిన పూర్తి వివరాలు, నిబంధనలు, అవసరమైన పత్రా ల సమాచారాన్ని కడప జిల్లా అధికారిక వెబ్‌సైట్ kadapa.ap.gov.in లో పరిశీలిం చవచ్చని తెలిపారు.ఆసక్తి ఉన్న సంస్థలు, కాంట్రాక్టర్లు మరిన్ని వివరాల కోసం జిల్లా పర్యాటక శాఖ అధికారి కార్యా లయం, 'డి' బ్లాక్, నూతన కలెక్టరేట్, రిమ్స్ రోడ్, కడపలో సంప్రదించవచ్చు. ఫోన్: 630 9942030, ఈమె యిల్: dtpokadapa@gmail.com ద్వారా కూడా వివరాలు తెలుసు కోవచ్చని అధికారులు తెలిపారు.

# కలశ్ వందన్ అభియాన్‌ను విజయవంతం చేయాలి

## బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మచ్చ విశ్వాస్

రామ్‌మందిర్ ఏరియా, ఆగస్టు 23 (జర్నలిస్ట్ ఫైల్) :




బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'కలశ్ వందన్ అభియాన్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మచ్చ విశ్వాస్ పిలుపునిచ్చారు. గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

సంత్ శిరోమణి రవిదాస్ మహారాజ్ 650వ జయంతిని పురస్కరించుకుని బీజేపీ ఎస్సీ మోర్చా దేశవ్యాప్తంగా పలు కార్యక్రమాలకు పిలుపునిచ్చిందని తెలిపారు. సంత్ రవిదాస్ మహారాజ్ బోధనలు సమాజానికి మార్గదర్శకమని, కుల, వర్గ భేదాలకు అతీతంగా ఐక్యత, సోదరభావం, సామరస్యాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

ఆషాఢ పౌర్ణమి సందర్భంగా కాశీలోని సంత్ రవిదాస్ మహారాజ్ జన్మస్థలమైన సీర్ గోవర్ధన్‌పూర్ పవిత్ర క్షేత్రం నుంచి సేకరించిన మట్టితో పూజించిన పవిత్ర కలశాలను దేశంలోని అన్ని రాష్ట్రాలకు పంపించినట్లు వివరించారు. తెలంగాణకు చేరుకున్న పవిత్ర కలశాన్ని రాష్ట్రంలోని 33 జిల్లాలకు తీసుకెళ్లి, సంత్ రవిదాస్ మహారాజ్ సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేలా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఈ నెల 23న హైదరాబాద్ నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో తెలంగాణలోని 33 జిల్లాలకు పవిత్ర కలశాల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రులు, బీజేపీ జాతీయ, రాష్ట్ర నాయకులు, పార్టీ పదాధికారులు, హిందూ బంధువులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నట్లు తెలిపారు. పెద్దపల్లి జిల్లా నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు, హిందూ బంధువులు అధిక సంఖ్యలో హైదరాబాద్‌కు తరలివచ్చి 'కలశ్ వందన్ అభియాన్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మచ్చ విశ్వాస్ కోరారు.

ఈ సమావేశంలో బీజేపీ తిలక్‌నగర్ మండల అధ్యక్షుడు ఐత పవన్, ఎల్తూరి రాజయ్య, పంగ రవి, కల్లెపల్లి సాగర్, నవీన్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

# దొంగతనాల నివారణకు రాత్రివేళల్లో యువత, గ్రామ పెద్దల గస్తీ

నిర్మల్‌జిల్లా, ఆగస్టు 23 (జర్నలిస్ట్ ఫైల్) :



గ్రామాల్లో దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాల నివారణకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. పోలీసుల భద్రతా చర్యలకు తోడుగా తమ గ్రామాన్ని తామే కాపాడుకోవాలనే ఉద్దేశంతో యువకులు, గ్రామ పెద్దలు బృందాలుగా ఏర్పడి రాత్రివేళల్లో గస్తీ నిర్వహిస్తున్నారు. భైంసా మండలంలోని మాటేగాం, టాక్లి, సుంక్లీ, కామోల్ గ్రామాల్లో రాత్రివేళల్లో గ్రామస్తుల నిఘా కొనసాగుతోంది. యువత, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు కలిసి గ్రామంలోని ప్రధాన వీధులు, పరిసర ప్రాంతాల్లో పర్యటిస్తూ అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గమనిస్తున్నారు.

అవసరమైన చోట్ల పోలీసుల సూచనలను పాటిస్తూ గ్రామ భద్రతలో తమ వంతు బాధ్యతగా రాత్రి గస్తీ నిర్వహిస్తున్నారు. టాక్లి గ్రామంలో ఎస్సై సుప్రియ సూచనలతో సర్పంచ్, ఉపసర్పంచ్, గ్రామస్తులు కలిసి అప్రమత్తంగా ఉంటుండగా, మిగిలిన గ్రామాల్లోనూ యువత, గ్రామ పెద్దలు సమన్వయంతో గస్తీ కొనసాగిస్తున్నారు. దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు గ్రామస్తులు రాత్రివేళల్లో బృందాలుగా ఏర్పడి నిఘా పెట్టడం, అనుమానాస్పద కదలికలను గుర్తించడం ద్వారా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, ఏదైనా అనుమానాస్పద సంఘటన చోటుచేసుకున్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలు కోరుతున్నారు. పోలీసుల భద్రతా చర్యలకు ప్రజల సహకారం తోడైతే నేరాలను మరింత సమర్థంగా అరికట్టవచ్చని పేర్కొంటున్నారు. మన ఊరు.. మన బాధ్యత.. మన భద్రత.. మన చేతుల్లోనే అనే నినాదంతో గ్రామస్తులు ఐక్యంగా చేపడుతున్న రాత్రి గస్తీ కార్యక్రమం అభినందనీయంగా నిలుస్తోంది. గ్రామ భద్రత కోసం ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావడం ఇతర గ్రామాలకు సైతం ఆదర్శంగా మారుతోంది.

## ఘనంగా ప్రకాశం పంతులు జయంతి



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్ ):** గుంటూరు కలెక్టరేట్‌లో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కె. ఖాజావలి టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎస్ సి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దుర్గా భాయి, కలెక్టరేట్ ఏఓ మల్లీశ్వరి తదితరులు పాల్గొని నివాళులర్పించారు.
ఈ సందర్భంగా డీఆర్ఓ ఖాజావలి మాట్లాడుతూ, టంగుటూరి ప్రకాశం పంతులు స్వాతంత్ర్య సమరయోధుడిగా, న్యాయవాదిగా, ప్రజా నాయకుడిగా దేశానికి, రాష్ట్రానికి విశిష్ట సేవలందించారని తెలిపారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన ధైర్యసాహసాలతో పాల్గొని ప్రజల్లో జాతీయ స్ఫూర్తిని నింపారని పేర్కొన్నారు. బ్రిటిష్ సైనికులు తుపాకులు గురిపెట్టినా వెనుకడుగు వేయకుండా తన గుండె చూపించి నిలబడిన ధైర్యానికి గుర్తుగా ఆయనకు 'ఆంధ్రకేసరి' అనే బిరుదు లభించిందన్నారు. ప్రజల హక్కులు, స్వాతంత్ర్యం, సామాజిక న్యాయం కోసం ఆయన జీవితాంతం కృషి చేశారని తెలిపారు. ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా కూడా ప్రజలకు సేవలందించిన ఆయన పరిపాలనా దక్షత, ప్రజాసేవా దృక్పథం నేటి తరానికి ఆదర్శప్రాయమన్నారు.
టంగుటూరి ప్రకాశం పంతులు ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజాసేవలో ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలని డీఆర్ఓ పిలుపునిచ్చారు. దేశం కోసం, ప్రజల కోసం ఆయన చేసిన త్యాగాలను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు.

## చట్టబద్ధమైన జీవనం సాగించాలి



- **రౌడీ షీటర్లు, నేరచరిత్ర కలిగిన వారికి గుంటూరు జిల్లా పోలీసుల ప్రత్యేక కౌన్సిలింగ్**

**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్ ):** జిల్లా వ్యాప్తంగా నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా రౌడీ షీటర్లు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులకు గుంటూరు జిల్లా పోలీసులు ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు ఆదివారం అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ కార్యక్రమం చేపట్టారు.
కౌన్సిలింగ్ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ, గతంలో జరిగిన తప్పులను పునరావృతం చేయకుండా చట్టాలను గౌరవిస్తూ బాధ్యతాయుతమైన పౌరులుగా జీవించాలని సూచించారు. కుటుంబ సభ్యులు, సమాజం గర్వించే విధంగా మంచి ప్రవర్తనతో జీవిస్తూ ఎలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని హితవు పలికారు.
ప్రజల ప్రశాంతతకు భంగం కలిగించే చర్యలు లేదా నేరాలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని అధికారులు స్పష్టం చేశారు. రౌడీ షీటర్లు, నేరప్రవృత్తి కలిగిన వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా కొనసాగుతుందని తెలిపారు.
నేరాలకు దూరంగా ఉండి చట్టబద్ధమైన జీవనం సాగించాలనుకునే వారికి గుంటూరు జిల్లా పోలీసులు అవసరమైన సహకారం అందిస్తారని అధికారులు పేర్కొన్నారు.

## పి.జి.ఆర్.ఎస్‌లో అర్జీలు అందించండి... పరిష్కారం పొందండి



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్ ):** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్)ను ప్రతీ సోమవారం జిల్లా, మండల స్థాయిలో అన్ని కార్యాలయాల్లో నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు.
పి.జి.ఆర్.ఎస్ టోల్ ఫ్రీ నంబర్ 1100 కు ఫోన్ చేసి ఆర్జీల వివరాలు తెలుసుకోవచ్చని సూచించారు. మీ కోసం వెబ్ సైట్ లో ప్రజలు తమ సమస్యలపై అర్జీలు సమర్పించవచ్చని అన్నారు.
ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలు నేరుగా సోమవారం నిర్వహిస్తున్న పి.జి.ఆర్.ఎస్ లో అర్జీలు సమర్పించవచ్చని లేదా మీ కోసం వెబ్ సైట్ Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) లో కూడా అర్జీలు నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పి.జి.ఆర్.ఎస్ కు ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ 1100 ను వినియోగించుకొని, ఆర్జీల పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చని సూచించారు. క్యూఆర్ కోడ్ ద్వారా స్పందన తెలియజేయవచ్చని చెప్పారు.

## కంటిచూపుపై ప్రత్యేక శ్రద్ధ అవసరం : ఎమ్మెల్యే నసీర్

- **అంజుమన్ ఇస్లామియా ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం**
- **అవసరమైన వారికి ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు**



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్ ):** మనిషికి అన్నింటికంటే నయనం ప్రధానమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ అన్నారు. ఆదివారం అంజుమన్ ఇస్లామియా పాఠశాలలో ఎమ్మెల్యే నసీర్ ఆధ్వర్యంలో శంకర ఆసుపత్రి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ వృద్ధులకు ఇలాంటి ఉచిత కంటి వైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. శుక్లాలు, కంటిలో పొర వంటి సమస్యలతో వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారని చెప్పారు. ప్రస్తుత రోజుల్లో సామాజిక మాధ్యమాల ప్రభావంతో విద్యార్థులు సైతం చిన్న వయసులోనే కంటి చూపు సమస్యలు తలెత్తుతున్నాయన్నారు.
తల్లిదండ్రులు పిల్లలను ఎప్పటికప్పుడు మొబైల్స్, టీవీలకు దూరంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. మొబైల్స్ పిల్లల ప్రగతికి ఉపయోగపడాలన్నారు. సెల్ ఫోన్లు చూడటం కారణంగా కంటిచూపుపై తీవ్ర ప్రభావం చూపుతుందని చెప్పారు ఉచిత కంటి వైద్య శిబిరంలో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. వైద్య పరీక్షల అనంతరం అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తారని అన్నారు.

## ఆంధ్రకేసరి జీవితం అందరికీ ఆదర్శం : ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్ ):** తెల్లదొరల తూపాకీ గుండుకు తన గుండెను ఎదురొడ్డిన టంగుటూరి ప్రకాశం పంతులు వీరత్వం.. దేశ దాస్య విమోచన యజ్ఞంలో ఆంధ్రులను ఒక్క తాటిపై నడిపించిన ఆయన మార్గదర్శకత్వం.. అందరికీ ఆదర్శమని శాసనమండలి సభ్యులు, ఆంధ్రకేసరి అభిమాన సంఘం గౌరవ అధ్యక్షులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి కీర్తించారు. ఆంధ్ర రాష్ట్ర మొట్టమొదటి ముఖ్యమంత్రి, ఆంధ్ర రాజకీయాల్లో ప్రముఖంగా వెలుగొందిన నేతల్లో ప్రథముడైన టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు ఆంధ్రకేసరి అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శంకర్‌విలాస్ సెంటర్‌లోని ప్రకాశం చౌక్‌లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.
అనంతరం ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ, తెలుగువారి తెగువకు నిలువెత్తు రూపం ప్రకాశం పంతులు అని శ్లాఘించారు. "ప్రమాదములున్నచోటే ప్రకాశం పంతులు గారు ఉంటారు" అన్న ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు భోగరాజు పట్టాభి సీతారామయ్య మాటలు అక్షర సత్యాలని ఆయన వ్యాఖ్యానించారు. 1922లో సహాయ నిరాకరణ ఉద్యమం ముమ్మరంగా సాగుతున్న సమయంలో 30వేల మంది స్వచ్ఛందకులతో గుంటూరులో భారీ ప్రదర్శన నిర్వహించారనీ... తద్వారా గుంటూరుతో ఆయనకు గట్టి సంబంధం ఏర్పడిందనీ... ఆయన వివరించారు. దానికి గుర్తుగానే ఆనాడు తామంతా ఒక కమిటీగా ఏర్పడి, ఆయన పాదయాత్ర చేసిన ఈ ప్రాంతంలో ప్రకాశం పంతులు విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో పాటు దీనికి ప్రకాశం చౌక్‌గా నామకరణం కూడా చేసుకున్న ఉదంతాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. దేశంకోసం, దేశస్వాతంత్ర్యంకోసం తన యావదాస్తినీ త్యాగం చేయడమే కాక తాను ముఖ్యమంత్రిగా పనిచేసిన స్వల్పకాలంలోనే ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి కోసం అనేక సంస్కరణలు ప్రవేశపెట్టిన ప్రకాశం పంతులు జీవితాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో బందా రవీంద్రనాథ్, ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), బందా శశి, రత్నప్రసాద్, బత్తుల దేవానంద్, అంబేద్కర్, వంశీ, మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, షరీఫ్, నూనె ఉమామహేశ్వరరెడ్డి, పానుగంటి చైతన్య, పరిశపోగు శ్రీనివాసరావు, కాకి శ్రీను, టీఎల్వీ వీరాంజనేయులు, బైరెడ్డి రవీంద్రారెడ్డి, కొరిటిపాటి ప్రేమ్‌కుమార్, ఆలా కిరణ్, పోకల వసంత్, రెడ్డి కోటేశ్వరరావు, సింగు నరసింహారావు, నర్సిరెడ్డి, బాలిరెడ్డి, భాగ్యారావు, సుందరరావు, సుబ్బరాజు, శంకర్, జాన్సీ, వనజాక్షి, విజయమాధవి, రత్నకుమారి, దుర్గ, శివపార్వతి, అరుణ, మన్నెం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తే మరో ఉద్యమం తప్పదు

- **కూటమి ప్రభుత్వం వెంటనే సంఘాలతో చర్చించి ఆర్థిక డిమాండ్లు పరిష్కరించాలి**
- **ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి. హృదయ రాజు**




**కర్నూలు, (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్ల ఆర్థిక డిమాండ్ల పరిష్కారంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి. హృదయ రాజు విమర్శించారు. ప్రభుత్వం వెంటనే ఉద్యోగ సంఘాలను చర్చలకు ఆహ్వానించి పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా మరో ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. కర్నూలులో జిల్లా అధ్యక్షుడు ఎస్. ఇస్మాయిల్ అధ్యక్షతన జరిగిన ఏపీటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.
సమావేశంలో హృదయ రాజు మాట్లాడుతూ, నిత్యావసర వస్తువులు, విద్యాసంస్థల ఫీజులు, వైద్య ఖర్చులు నిరంతరం పెరుగుతున్న నేపథ్యంలో ఉద్యోగులకు శాస్త్రీయంగా రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలను ప్రభుత్వం మంజూరు చేయడం లేదని అన్నారు. వెంటనే 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించి 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని, పెండింగ్ డీఏలు, 11వ పీఆర్సీ బకాయిలు, 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న ఈఎల్ ఎన్‌క్యాష్‌మెంట్‌ను విడుదల చేయాలని, కొత్త ఐదు డీఏలను మంజూరు చేయడంతో పాటు సీపీఎస్ ఉద్యోగులకు నగదు రూపంలో చెల్లించాల్సిన డీఏ బకాయిలను కూడా చెల్లించాలని డిమాండ్ చేశారు.
గత నెల గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ సమావేశంలో ఇచ్చిన హామీ మేరకు ఆగస్టులో ముఖ్యమంత్రి అధ్యక్షతన సమావేశం నిర్వహించి అన్ని సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు. నిర్ణయాలు తీసుకోకపోతే తదుపరి ఆందోళన కార్యాచరణను ప్రకటిస్తామని స్పష్టం చేశారు.
జిల్లా అధ్యక్షుడు ఎస్. ఇస్మాయిల్, ప్రధాన కార్యదర్శి పూజారి లక్ష్మయ్య, గౌరవాధ్యక్షుడు ఐ. మరియానందం మాట్లాడుతూ, ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు కల్పించాలని, ప్రస్తుత పరీక్షల్లో డిపార్ట్‌మెంటల్ టెస్టుల మాదిరిగా 40 శాతం ఉత్తీర్ణత మార్కులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. జీతాలను 'ఐ గాట్ కర్మయోగి' యాప్‌తో అనుసంధానం చేయరాదని, బోధనేతర పనులను తొలగించాలని, రాష్ట్రపతి ఉత్తర్వుల అమలుకు ముందే పెండింగ్‌లో ఉన్న స్కూల్ అసిస్టెంట్, ప్రధానోపాధ్యాయుల పదోన్నతులను కల్పించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## జడ్పీ హైస్కూల్‌లో హోలీస్టిక్ వారిచే ఉచిత వైద్య శిబిరం



**మైదుకూరు (జర్నలిస్ట్ ఫైల్ )** మైదుకూరు మండలం వనిపెంట గ్రామం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆదేశాల మేరకు బీసీ చైతన్య సమితి సలహాదారులు తమ్మిశెట్టి సుబ్బారాయుడు మరియు వారి ధర్మపత్ని తమ్మిశెట్టి సుభద్రమ్మ ఆధ్వర్యంలో కడప హోలీస్టిక్ హాస్పిటల్ వారి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. వైద్య నిమిత్తం విచ్చేసిన ప్రతి ఒక్కరికి ఉచిత వైద్యం ప్రతి ఒక్కరికి అన్నదానం జాతీయ బీసీ చైతన్య సమితి సలహాదారులు తమ్మిశెట్టి సుబ్బారాయుడు చేపట్టారు.

## వినుకొండ దాహార్తికి శాశ్వత పరిష్కారం... రూ.239.06 కోట్లతో మహా జలధార

- **తాగునీటి పథకానికి శంకుస్థాపన చేసిన మంత్రి గొట్టిపాటి, ఎంపీ లావు, చీఫ్ విప్ జీవీ**



**వినుకొండ, (జర్నలిస్ట్ ఫైల్):** వినుకొండ పట్టణ ప్రజల దశాబ్దాల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా కూటమి ప్రభుత్వం కీలక అడుగు వేసింది. పట్టణ ప్రజలకు నిరంతరం సురక్షితమైన, నాణ్యమైన తాగునీరు అందించేందుకు రూ. 239.06 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న సమగ్ర తాగునీటి పథకానికి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆదివారం వినుకొండలోని ఎన్ఎస్‌పీ గ్రౌండ్‌లో శంకుస్థాపన చేశారు.

**నాణ్యతపై రాజీ వద్దు... రోడ్లను కూడా పునరుద్ధరించాలి: మంత్రి గొట్టిపాటి**

రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ, సుమారు రూ. 240 కోట్ల భారీ వ్యయంతో వినుకొండ ప్రజలకు శాశ్వత తాగునీటి భద్రత కల్పించే ప్రాజెక్టును చేపట్టడం సంతోషకరమన్నారు. తాగునీటి పథకాలను అత్యంత జాగ్రత్తగా, నాణ్యతా ప్రమాణాలతో అమలు చేయాలని సూచించారు. పైప్‌లైన్ల ఏర్పాటు కోసం తవ్విన రోడ్లను పనులు పూర్తయిన వెంటనే పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని ఆదేశించారు. ఇంత భారీగా ప్రజాధనం ఖర్చు చేస్తున్నప్పుడు చివరి ఇంటి వరకు నాణ్యమైన తాగునీరు చేరి, ప్రతి రూపాయికి ప్రజలకు ప్రయోజనం కలగాలని స్పష్టం చేశారు.

**తాగునీరు నుంచి విద్యుత్ వరకు... వినుకొండకు సమగ్ర అభివృద్ధి**

పట్టణాభివృద్ధి అంటే కేవలం తాగునీటికే పరిమితం కాదని, డ్రైనేజీలు, రోడ్లు, పారిశుద్ధ్యం, పార్కులు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలన్నింటినీ సమగ్రంగా అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి గొట్టిపాటి తెలిపారు. వినుకొండ అభివృద్ధికి జీవీ ఆంజనేయులు నిరంతరం మంత్రులు, ఉన్నతాధికారులను కలిసి కొత్త ప్రాజెక్టులు, నిధులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నారని అభినందించారు.

**శంకుస్థాపనతో ఆగొద్దు... త్వరగా ప్రజలకు నీరందించాలి: ఎంపీ లావు**

నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ, వినుకొండ ప్రజల దీర్ఘకాలిక తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే ఈ ప్రాజెక్టు నియోజకవర్గ అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలుస్తుందన్నారు. ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా సురక్షితమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో జీవీ ఆంజనేయులు ఈ ప్రాజెక్టు కోసం నిరంతరం కృషి చేశారని ప్రశంసించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అవసరమైన నిధుల సమీకరణకు ప్రత్యేక చొరవ చూపారని తెలిపారు. శంకుస్థాపనతో బాధ్యత పూర్తయినట్లు భావించకుండా నిర్ణీత గడువు కంటే ముందే పనులు పూర్తి చేసి ప్రజలకు నీరందించాలని అధికారులు, కాంట్రాక్టు సంస్థను కోరారు. వినుకొండ నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల తాగునీటి అవసరాల పరిష్కారానికి కూడా తన పూర్తి సహకారం ఉంటుందని స్పష్టం చేశారు.

**మాట ఇచ్చాం... కార్యరూపంలోకి తీసుకొస్తున్నాం: జీవీ ఆంజనేయులు**

ఈ సందర్భంగా ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ, వినుకొండ ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రధాన హామీల్లో శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారం అత్యంత ముఖ్యమైనదని తెలిపారు. "మాట ఇచ్చాం... నిధులు సాధించాం... ఇప్పుడు ప్రజల కళ్ల ముందే కార్యరూపంలోకి తీసుకొస్తున్నాం" అని పేర్కొన్నారు. అమృత్, ఖ×ణఖీ నిధులతో ఈ భారీ ప్రాజెక్టును చేపడుతున్నామని చెప్పారు.

**ఎన్ఎస్‌పీ నుంచి వినుకొండకు జలధార... ఆరు నెలలకు సరిపడా నీటి నిల్వ**

ఎన్ఎస్‌పీ మెయిన్ కెనాల్ నుంచి దొండపాడు చెరువు మీదుగా అండర్‌గ్రౌండ్ పైప్‌లైన్ ద్వారా నీటిని వినుకొండకు తీసుకొచ్చేలా ప్రాజెక్టును రూపొందించినట్లు జీవీ వివరించారు. మూడు చెరువులను సమీకరించి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేలా ప్రణాళిక రూపొందించామన్నారు. ఒక్కసారి పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేస్తే సుమారు ఆరు నెలలపాటు పట్టణ అవసరాలకు సరిపడా నీరు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ప్రతి వ్యక్తికి రోజు సురక్షితమైన తాగునీరు అందించడం, పట్టణంలోని చివరి కుటుంబం వరకు కుళాయి ద్వారా నీరు చేరేలా చేయడమే ఈ ప్రాజెక్టు లక్ష్యమని స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, జనసేన పార్టీ నాయకులు నాగ శ్రీను, నిశ్శంకర శ్రీను, బీజేపీ నాయకులు నల్లబోతు రమేష్, సుధాకర్, మేడం రమేష్, కూటమి పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తిరుమలలో శ్రీ వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి దంపతులు



**తిరుమల (జర్నలిస్ట్ ఫైల్ ):** గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి కుటుంబ సమేతంగా తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. శ్రీ భ్రమర టౌన్‌షిప్స్ అధినేత గళ్ళా రామచంద్రరావు జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.
దర్శనం అనంతరం తిరుమల తిరుపతి దేవస్థానం ఆలయ అర్చకులు గళ్ళా మాధవి దంపతులకు వేదాశీర్వచనం అందజేసి, స్వామివారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలను సమర్పించారు.
ఈ సందర్భంగా గళ్ళా మాధవి మాట్లాడుతూ, శ్రీ వేంకటేశ్వర స్వామి అనుగ్రహంతో ప్రతి సంవత్సరం కుటుంబ సమేతంగా తిరుమల దర్శనం చేసుకోవడం ఆనందంగా ఉంటుందని తెలిపారు. గళ్ళా రామచంద్రరావు జన్మదినాన్ని ఆధ్యాత్మిక వాతావరణంలో జరుపుకోవడం తమ కుటుంబానికి ఎంతో సంతోషాన్ని కలిగించిందని పేర్కొన్నారు.

## నిత్యాన్నదానానికి విరాళం



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ):** కేంద్ర మాజీ మంత్రి కొణిదల శివ శంకర ప్రసాద్ (మెగాస్టార్ చిరంజీవి )జన్మదిన సందర్భంగా శనివారం చిరంజీవి వీరాభిమాని అంబిశెట్టి వెంకటసుబ్బయ్య రాయల్ బ్రహ్మంగారిమఠం మండల బలిజ సంఘం ఉపాధ్యక్షుడు సీనియర్ విలేఖరి శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి దర్శించుకుని ఆయన పేరుతో అర్చన పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వయంకృషితో అంచలంచెలుగా ఎదిగిన మెగాస్టార్ చిరంజీవి నిండు నూరేళ్ళ ఆయురారోగ్యాలతో ఉండాలని శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆశీస్సులు ఆయనకు ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటున్నాను అన్నారు. సందర్భంగా శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి శాశ్వత నిత్య అన్నదాన పథకానికి మెగాస్టార్ చిరంజీవి పేరుతో ప్రతి సంవత్సరం అన్నదానం కొనసాగించేలా నగదును విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి మఠం మఠాధిపతి శ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వాములవారు మఠాధిపతి సోదరుడు శ్రీ దత్తాత్రేయ స్వామి చేతుల మీదుగా నగదు చెల్లించిన రసీదు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి అభిమానులు పాల్గొన్నారు.

## టంగుటూరి ప్రకాశం పంతులకు గుంటూరు జిల్లా పోలీసుల ఘన నివాళి



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్ ):** ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 155వ జయంతి సందర్భంగా గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘన నివాళి కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ డీఎస్పీ బెల్లం శ్రీనివాసరావు ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.
ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, నిర్భయత్వానికి, త్యాగానికి ప్రతీకగా నిలిచిన ప్రకాశం పంతులు భారత స్వాతంత్ర్య ఉద్యమంలో విశిష్ట పాత్ర పోషించారని కొనియాడారు. 1928లో సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా జరిగిన నిరసనలో బ్రిటిష్ తుపాకులకు ఎదురుగా తన ఛాతీని చూపిస్తూ ప్రదర్శించిన ధైర్యసాహసం భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. ప్రముఖ న్యాయవాది, పత్రికా సంపాదకుడు, స్వాతంత్ర్య సమరయోధుడిగా ప్రజల కోసం జీవితాన్ని అంకితం చేసిన ప్రకాశం పంతులు ఉమ్మడి మద్రాస్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా, అనంతరం ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా ప్రజా సంక్షేమానికి విశేష సేవలందించారని పేర్కొన్నారు. ఆయన నిజాయితీ, ప్రజాహితం భావితరాలకు ఆదర్శమని స్మరించుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఐలు, ఏఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పోలింగ్ స్టేషన్లకు సంబంధించి అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలి

**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్ ):** స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో భాగంగా పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితా విడుదల చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో 16 మండలాలలో 257 గ్రామ పంచాయతీలు ఉన్నాయన్నారు. 257 గ్రామ పంచాయతీలకు 2,879 పోలింగ్ స్టేషన్లకు సంబంధించిన ముసాయిదా ఆదివారం విడుదల చేయడం జరిగిందని చెప్పారు. ఆయా పోలింగ్ స్టేషన్లకు సంబంధించి ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 26వ తేదీ లోగా సమర్పించాలని ఆయన కోరారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## పద్మశాలి సేవా సంఘం నూతన భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్సీ ఆలపాటి



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** మండలంలోని జగడగుంటపాలెంలో శ్రీ పద్మశాలి మార్కండేయ సాంఘిక సంక్షేమ సేవా సంఘం నూతన భవనాన్ని ఎమ్మెల్సీ, తెనాలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కాటూరి సాంబశివరావు కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించగా, మాజీ ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు డైనింగ్ హాల్‌ను ప్రారంభించారు.

కార్యక్రమంలో ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, పద్మశాలీల సంక్షేమం కోసం కీర్తిశేషులు కాటూరి సాంబశివరావు విశేష సేవలందించారని కొనియాడారు. సేవా సంఘం ఆధ్వర్యంలో నూతన భవనంతో పాటు శివుని విగ్రహం, క్రతువుల గదులు ఏర్పాటు చేయడం సమాజ ఐక్యతకు దోహదపడుతుందని అన్నారు.

మాజీ ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ, పద్మశాలి సమాజ అభ్యున్నతి, ఐక్యత కోసం ఈ సేవా సంఘం భవనం నిర్మాణం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కటకం వెంకట్రావు, తిరువిధుల సాంబశివరావు, జొన్నాదుల మహేష్, పద్మశాలి సంఘ నాయకులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

## షరతులు లేకుండా కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

- ఏపీజీఈఎస్ఏ డిమాండ్



**గుంటూరు,(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో రెండు దశాబ్దాలుగా పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను ఎలాంటి షరతులు లేకుండా క్రమబద్ధీకరించాలని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ సర్వీసు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాంద్ బాష ప్రభుత్వాన్ని కోరారు. గుంటూరు కలెక్టరేట్‌లో విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన ఈ డిమాండ్ చేశారు.

చాంద్ బాష మాట్లాడుతూ, ప్రభుత్వ రంగ సంస్థలు, యూనివర్సిటీలు, గురుకుల పాఠశాలలు, వైద్యశాఖ, విద్యాశాఖలో కోఆర్డినేటర్లుగా పనిచేస్తున్న వేలాది కాంట్రాక్టు ఉద్యోగులు గత 20 సంవత్సరాలుగా ప్రభుత్వానికి, ప్రజలకు విశేష సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా కరోనా మహమ్మారి సమయంలో మెడికల్ విభాగంలోని కాంట్రాక్టు ఉద్యోగులు ప్రాణాలను పణంగా పెట్టి ప్రజల ప్రాణాలను కాపాడారని గుర్తు చేశారు.

ఇటీవల అసెంబ్లీలో ప్రవేశపెట్టిన కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ బిల్లు--2026ను అసోసియేషన్ స్వాగతిస్తోందని ఆయన తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగుల సేవలను గుర్తించి శాసనబద్ధంగా క్రమబద్ధీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని, అవసరమైతే న్యాయ సలహా తీసుకుని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను కూడా ఈ పరిధిలోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు.

గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న సుమారు 739 మంది కాంట్రాక్టు ఉపాధ్యాయులకు జూన్ నెల వేతనాలు ఇప్పటికీ చెల్లించలేదని చాంద్ బాష ఆవేదన వ్యక్తం చేశారు. రెండు దశాబ్దాలుగా వారి సేవలను వినియోగించుకున్న ప్రభుత్వం, కూటమి పాలనలో వారికి వేతనాలతో పాటు క్రమబద్ధీకరణ రూపంలో న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు చొరవతో సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.3 లక్షల వైద్య సాయం



**వేమూరు, (జర్నలిస్ట్ ఫైల్):** చుండూరు మండలం మున్నంగివారిపాలెం గ్రామానికి చెందిన వి.ఎస్. అప్పిరెడ్డి గొర్రెపాటికి ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్–రీయింబర్స్‌మెంట్) ద్వారా రూ. 3 లక్షల వైద్య ఆర్థిక సాయం మంజూరైంది. వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు మంజూరైన చెక్కును బాధితుడికి, కుటుంబ సభ్యులకు అందజేశారు.

అనారోగ్యంతో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందిన అప్పిరెడ్డి గొర్రెపాటి వైద్య ఖర్చుల బిల్లులను ఎమ్మెల్యే రిఫరెన్స్ లేఖతో సీఎంఆర్ఎఫ్ కార్యాలయానికి పంపించారు. దరఖాస్తును పరిశీలించిన ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ కింద రూ. 3,00,000 మంజూరు చేసింది. ఈ సందర్భంగా నక్కా ఆనందబాబు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారథ్యంలో కూటమి ప్రభుత్వం పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ వైద్య సహాయం గొప్ప భరోసాగా నిలుస్తోందని పేర్కొన్నారు. వేమూరు నియోజకవర్గంలో అర్హులైన ప్రతి బాధిత కుటుంబానికి ప్రభుత్వ సహాయం అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. వైద్య సాయం మంజూరు కావడంతో బాధితుడి కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

## సీనియర్ ఐఏఎస్ కన్నబాబు కుమారుడి వివాహ రిసెప్షన్‌కు హాజరైన మంత్రి లోకేష్



**హైదరాబాద్(జర్నలిస్ట్ ఫైల్):** సీనియర్ ఐఏఎస్ అధికారి కే. కన్నబాబు కుమారుడి వివాహ రిసెప్షన్ వేడుకకు రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. వట్టినాగులపల్లిలోని ఈవెంతారా కన్వెన్షన్‌లో నిర్వహించిన రిసెప్షన్ కార్యక్రమంలో పాల్గొని నూతన దంపతులు రితేష్ సూర్య ప్రీతమ్, హిమ ఐశ్వర్యలను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ నూతన దంపతులకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వారి దాంపత్య జీవితం ఆనందంగా, సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.

# మహిళా సాధికారతకు బీజేపీ పెద్దపీట : కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ

- వికసిత్ భారత్‌లో యువతదే కీలక పాత్ర
- పార్టీ పదవుల్లో 33 శాతం మహిళలకు కేటాయింపు
- చట్టం చేసే ముందు ఆచరించి చూపిస్తున్నాం
- పదవుల కోసం కాదు.. ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి రావాలి
- యువత భవిష్యత్ ప్రజాప్రతినిధులుగా ఎదగాలి: కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ



**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):** మహిళా సాధికారతకు భారతీయ జనతా పార్టీ అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. చట్టాలు చేసే ముందు వాటిని ఆచరించి చూపించాలనే ఆలోచనతో పార్టీ పదవుల్లో 33 శాతం మహిళలకు కేటాయిస్తూ బీజేపీ ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రపంచంలో పార్టీ పదవుల్లో 33 శాతం మహిళలకు కేటాయించిన పార్టీ బీజేపీయేనని పేర్కొన్నారు.

విజయవాడలో రెండు రోజులుగా నిర్వహించిన 'వికసిత్ భారత్ యంగ్ పొలిటికల్ లీడర్స్ డైలాగ్--2026' ముగింపు సభలో శనివారం ఆయన ముఖ్య ప్రసంగం చేశారు. 'వికసిత్ భారత్' సాధనలో యువత కీలక పాత్ర పోషించాల్సి ఉందన్నారు.

**మహిళలకు ఆచరణలో అవకాశాలు**

గత పాతికేళ్లుగా బీజేపీ అనుబంధ సంఘాలు, వివిధ మోర్చాల్లో 33 శాతం పదవులను మహిళలకు కేటాయిస్తూ వస్తున్నామని శ్రీనివాస వర్మ చెప్పారు. నేడు అనేక మంది మహిళలు కేంద్ర మంత్రులుగా, ఎంపీలుగా, రాజ్యసభ సభ్యులుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారని తెలిపారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గతంలో ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధికార ప్రతినిధిగా పనిచేశారని గుర్తుచేశారు.

చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లును ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. మహిళా రిజర్వేషన్ అమలుకు అవసరమైన చర్యలు రాబోయే ఎన్నికల్లో చేపడతారనే విశ్వాసం వ్యక్తం చేశారు.

**పశ్చిమ గోదావరి స్ఫూర్తి**

బీజేపీలో మహిళలకు లభిస్తున్న అవకాశాలకు పశ్చిమ గోదావరి జిల్లానే నిదర్శనమని చెప్పారు. జిల్లాలో మహిళ జిల్లా అధ్యక్షురాలిగా, మరో మహిళ రాష్ట్ర బీజేపీ కార్యదర్శిగా, ఇంకొకరు మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా, మరో మహిళ పార్టీ అధికార ప్రతినిధిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారని వివరించారు. కేంద్ర మంత్రి హోదాలో సమావేశానికి వచ్చిన తన చుట్టూ ఐదుగురు మహిళా నాయకులు ఉండే స్థాయిలో బీజేపీ అవకాశాలు కల్పించిందని తెలిపారు.

**పదవులు కాదు.. ప్రజాసేవే లక్ష్యం**

'వికసిత్ భారత్' సాధన ప్రధాని మోదీ ఒక్కరి వల్లే సాధ్యం కాదని, దేశ ప్రజలందరి భాగస్వామ్యం అవసరమని శ్రీనివాస వర్మ అన్నారు. ప్రతి కార్యకర్త తన బాధ్యత, కర్తవ్యాన్ని గుర్తించి పనిచేయాలని పిలుపునిచ్చారు.

యువత భవిష్యత్తులో ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులుగా ఎదగాలని ఆకాంక్షించారు. అయితే పదవులే లక్ష్యంగా రాజకీయాల్లోకి రావద్దని.. ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో రాజకీయాల్లోకి రావాలని సూచించారు.

**రెండు స్థానాల నుంచి అధికార పీఠం వరకు**

తాను 36 ఏళ్ల క్రితం బీజేపీలో చేరినప్పుడు ఎంపీ కావాలనో, కేంద్ర మంత్రి కావాలనో పార్టీలోకి రాలేదని శ్రీనివాస వర్మ తెలిపారు. దేశ హితం కోసం, భారత్‌ను భవిష్యత్తులో విశ్వగురుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో బీజేపీలో చేరానన్నారు.

దేశవ్యాప్తంగా బీజేపీకి కేవలం రెండు లోక్‌సభ స్థానాలు ఉన్న సమయంలోనూ కార్యకర్తలు పార్టీని వీడలేదని గుర్తుచేశారు. అధికారం, పదవులు, సంపద కోసం రాజకీయాల్లోకి రావాలనుకుంటే అప్పట్లో అనేక ఇతర పార్టీలు అందుబాటులో ఉండేవని వ్యాఖ్యానించారు.

**క్షేత్రస్థాయి నుంచి నాయకత్వం**

రెండు రోజుల కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలను స్ఫూర్తిగా తీసుకుని యువత క్షేత్రస్థాయిలో ప్రజాసేవకు అంకితం కావాలని కేంద్ర మంత్రి పిలుపునిచ్చారు. సమాజం, దేశం కోసం పనిచేస్తూ సమర్థవంతమైన ప్రజాప్రతినిధులుగా ఎదగాలని ఆకాంక్షించారు.

మహిళా సాధికారత, యువ నాయకత్వం, ప్రజాసేవను సమన్వయం చేసుకుంటూ 2047 నాటికి వికసిత్ భారత్ సాధనలో యువత ముందుండాలని శ్రీనివాస వర్మ పిలుపునిచ్చారు.

**యువ నాయకత్వానికి దిశానిర్దేశం**

బీజేవైఎం ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల కార్యక్రమంలో 'లీడర్‌షిప్ ఫర్ టుమారో', 'విమెన్ లీడింగ్ ఇండియాస్ ట్రాన్స్‌ఫర్మేషన్', 'ఇండియా బిఫోర్ 2014 అండ్ ఆఫ్టర్ 2014', 'సక్సెస్ స్టోరీస్ అండ్ పాత్‌వేస్ ఫర్ వికసిత్ భారత్' తదితర అంశాలపై చర్చలు జరిగాయి.

ముగింపు కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ రెడ్డి పాల్గొన్నారు. యువత భవిష్యత్ నాయకత్వానికి సిద్ధం కావాలని, ప్రజా సమస్యలపై అవగాహన పెంచుకుని దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని నాయకులు సూచించారు.

బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు నాగోతు రమేష్ నాయుడు,సన్నారెడ్డి దయాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గుంటూరు-కృష్ణా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో డాక్టర్ ఏ.ఎస్. రామకృష్ణ

- 23 ఉపాధ్యాయ-అధ్యాపక సంఘాల ఏకగ్రీవ మద్దతు



**గుంటూరు,(జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు-కృష్ణా జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు డాక్టర్ ఏ.ఎస్. రామకృష్ణను ఉమ్మడి అభ్యర్థిగా 23 ఉపాధ్యాయ-అధ్యాపక సంఘాలు ఏకగ్రీవంగా ప్రకటించాయి. గుంటూరులోని బృందావన్ గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించిన కీలక సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. వచ్చే ఏడాది మార్చి--ఏప్రిల్‌లో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అనుభవజ్ఞుడైన నాయకత్వాన్ని బరిలోకి దించాలని సంఘాలు నిర్ణయించాయి.

**సమస్యల పరిష్కారానికి అనుభవమే బలం**

సమావేశంలో మాట్లాడిన సంఘాల ప్రతినిధులు, డాక్టర్ ఏ.ఎస్. రామకృష్ణ 2015--2021 మధ్య ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పనిచేసిన కాలంలో ఉపాధ్యాయులు, అధ్యాపకుల సర్వీస్ సమస్యలు, పదోన్నతులు, జీతభత్యాలు, ఉద్యోగ భద్రత, సంక్షేమ అంశాలను శాసనమండలిలో బలంగా ప్రస్తావించారని గుర్తు చేశారు. సంబంధిత శాఖలు, అధికారులు, మంత్రులతో చర్చించి అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేసిన అనుభవం ఆయనకు ఉందని పేర్కొన్నారు.

**ఐక్యతకు ప్రతీకగా 23 సంఘాల నిర్ణయం**

ప్రస్తుతం విద్యారంగంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పరిపాలనా, ఆర్థిక, పదోన్నతి, ఉద్యోగ భద్రత సమస్యలకు సమర్థవంతంగా ప్రాతినిధ్యం వహించే నాయకత్వం అవసరమనే అభిప్రాయంతో అన్ని సంఘాలు ఒకే అభ్యర్థిపై ఏకాభిప్రాయానికి వచ్చినట్లు వెల్లడించాయి. ఉపాధ్యాయుల ప్రయోజనాల పరిరక్షణ, విద్యారంగ అభివృద్ధి, హక్కుల సాధనే ప్రధాన లక్ష్యమని సంఘాల నాయకులు తెలిపారు.

**విజయం కోసం సమష్టి కృషి**

గుంటూరు-కృష్ణా జిల్లాల ఉపాధ్యాయులు, అధ్యాపకుల మద్దతుతో డాక్టర్ ఏ.ఎస్. రామకృష్ణను ఘన విజయం సాధింపజేసి శాసనమండలిలో ఉపాధ్యాయుల సమస్యలకు బలమైన స్వరం కల్పిస్తామని సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు ప్రకటించారు. ఈ సమావేశానికి నోబుల్ టీచర్స్ అసోసియేషన్, టీచర్స్ గిల్డ్, రాష్ట్ర ప్రధానోపాధ్యాయుల సంఘం, ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకుల సంఘం, గవర్నమెంట్ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్, గురుకుల, మోడల్ స్కూల్స్, కస్తూర్బా విద్యాలయాలు, కాంట్రాక్ట్ అధ్యాపక సంఘాలు తదితర 23 ఉపాధ్యాయ-అధ్యాపక సంఘాల ప్రతినిధులు హాజరై ఏకగ్రీవ మద్దతు ప్రకటించారు.

## ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా 'సేవా సంకల్ప్ అభియాన్'

- దేశవ్యాప్తంగా సేవా కార్యక్రమాలకు బీజేపీ కార్యాచరణ
- ఢిల్లీలో జాతీయ కార్యశాలలో పాల్గొన్న ఏపీ బృందం




**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్):** ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా సెప్టెంబర్ 17న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమాలపై భారతీయ జనతా పార్టీ కార్యాచరణను రూపొందిస్తోంది. ఈ నేపథ్యంలో ఢిల్లీలో నిర్వహించిన జాతీయ కార్యశాలలో ఆంధ్రప్రదేశ్ బీజేపీ ప్రతినిధి బృందం పాల్గొంది. జాతీయ కార్యశాలలో ఏపీ బీజేపీ రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి మధుకర్ జీ, రాష్ట్ర మంత్రి వై. సత్యకుమార్ యాదవ్, సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, కోలా ఆనంద్, నిర్మలా కిషోర్, ఇస్కా సునీల్, కె. నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 17న ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా రక్తదాన శిబిరాలు, ఆరోగ్య శిబిరాలు, పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించే దిశగా పార్టీ శ్రేణులకు కార్యాచరణపై మార్గదర్శకాలు అందించినట్లు బీజేపీ నాయకులు తెలిపారు.

## రిజర్వేషన్ హటావో ఆందోళన అర్థరహితం

- ఎస్సీ,ఎస్టీల పట్ల అక్కసు,ద్వేషం తోనే ఈతరహా ఆందోళనలు
- ఎస్సీ,ఎస్టీలతో సహా దేశంలో అన్ని వర్గాలకు రిజర్వేషన్లు ఉన్నాయి



**అమరావతి, (జర్నలిస్ట్ ఫైల్):** దేశంలో ఎస్సీ ఎస్టీలతోపాటు అన్ని వర్గాల ప్రజలు అనుభవిస్తున్న రిజర్వేషన్ లను తొలగించాలంటూ రిజర్వేషన్ హఠావో పేరుతో కొందరు ఆందోళనలు చేయడం అర్థరహితమని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్‌బాబు పేర్కొన్నారు. కుల ప్రాతిపదికన కాకుండా ఆర్థిక పరంగా రిజర్వేషన్ లు ఉండాలనే డిమాండ్ తో కొంతమంది యువత సామాజిక మాధ్యమాల ద్వారా మరియు ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ఆందోళనలు చేపట్టడంపై సురేష్ బాబు స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజర్వేషన్ ల యొక్క ఆశయం,అవసరం యొక్క ప్రాధాన్యత పై అవగాహన లేని వాళ్ళు మాత్రమే ఈ తరహా ఉద్యమంలో పాల్గొంటున్నారని అన్నారు. కులం ఆధారంగా కాకుండా పేదరికం ప్రాతిపదికన అగ్రకులాలకు కూడా రిజర్వేషన్లు అందుతున్నాయన్న విషయం ఆందోళనలో పాల్గొంటున్న యువత గ్రహించాలని సూచించారు. దేశంలో ఎస్సీ, ఎస్టీలతోపాటు ఓ బి సి, మైనారిటీ,మహిళలతో పాటు అగ్రకులాల్లో పేదలు కూడా రిజర్వేషన్లు పొందుతున్నారని ,దేశంలో రిజర్వేషన్లు పొందని వారు ఎవరో చెప్పాలని సురేష్ బాబు ప్రశ్నించారు.కేవలం ఎస్సీ,ఎస్టీల పై వివక్ష,వారి అభివృద్ధి పట్ల ద్వేషం, అక్కసు ఉన్నవారి ఆలోచనల ప్రతిరూపంగానే ఈ ఆందోళనకు బీజం పడివుంటుందని సురేష్ బాబు అభిప్రాయం వ్యక్తం చేశారు.దేశంలో పీడిత వర్గాల సమస్యలు, వివక్ష,సామాజిక అసమానతలను తొలగించేలా ఉద్యమాలు చేసి తమ దేశభక్తి, సామాజిక బాధ్యతను నిరూపించుకోవాలని ఆందోళనకారులకు సురేష్ బాబు హితవు పలికారు.సమాజంలో వివక్ష,అసమానతలు తొలగించటానికి రిజర్వేషన్లు తప్పనిసరి అని సురేష్ బాబు స్పష్టం చెసారు.రాజకీయ పార్టీలు,మేధావులు ప్రజాస్వామిక వాదులు ఈ తరహా ఆందోళనలను ఖండించాలని కోరారు.

# శబరిమల పవిత్రతను కాపాడాలి.. భక్తుల సమస్యలు పరిష్కరించాలి

- టీటీడీ తరహాలో తరహాలో వ్యవస్థ ఏర్పాటు చేయాలి
- గురుస్వాముల రాష్ట్ర సమ్మేళనంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్..



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** శబరిమల అయ్యప్ప క్షేత్ర పవిత్రతను కాపాడటంతో పాటు అయ్యప్ప భక్తులకు మెరుగైన యాత్రా సౌకర్యాలు కల్పించేందుకు కేంద్ర, కేరళ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలతో సమన్వయం చేసుకుని పనిచేస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. నవంబరు 15 నుంచి జనవరి 20 వరకు జరిగే అయ్యప్ప సీజన్‌లో భక్తులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఇప్పటి నుంచే కార్యాచరణ ప్రారంభిస్తామని చెప్పారు.

విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన అయ్యప్ప గురుస్వాముల రాష్ట్ర సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన గురుస్వాములు శబరిమల యాత్రలో ఎదురవుతున్న సమస్యలను మాధవ్ దృష్టికి తీసుకువచ్చారు. యాత్రలో అనారోగ్యానికి గురైతే సరైన వైద్యసాయం అందక దిక్కుతోచని పరిస్థితులు ఎదురవుతున్నాయని కొందరు గురుస్వాములు గద్గద స్వరంతో వివరించారు. ఈ సమ్మేళనాన్ని ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరాం పర్యవేక్షించారు.

**ధర్మ పరిరక్షణకు సంఘటితం కావాలి**

"శివస్వామి, బెజవాడ కనకదుర్గమ్మ, శబరిమల అయ్యప్పస్వామి కరుణాకటాక్షాలతోనే ప్రపంచం నడుస్తోందని త్రికరణశుద్ధిగా విశ్వసిస్తున్నాను" అని మాధవ్ అన్నారు. లక్షలాది మందికి అయ్యప్ప మాలధారణ చేయించి, ఇరుముడులు సమర్పింపజేసి స్వాములుగా తీర్చిదిద్దుతున్న గురుస్వాములకు పాదాభివందనాలు తెలిపారు. గురుస్వాములు 41 రోజుల దీక్షకే పరిమితం కాకుండా జీవితాంతం ధర్మాన్ని, ఆధ్యాత్మికతను ముందుకు తీసుకెళ్లే మార్గదర్శకులుగా నిలుస్తున్నారని కొనియాడారు. హైందవ ధర్మం, దేవాలయ వ్యవస్థ, సనాతన సంప్రదాయాలపై జరుగుతున్న దాడుల పట్ల హిందూ సమాజంలో చైతన్యం పెరగాల్సిన అవసరం ఉందన్నారు. "కలియుగంలో సంఘే శక్తి" అనే భావనతో హిందూ సమాజం సంఘటితమై ధర్మ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**శబరిమలపై కుట్రలను అడ్డుకోవాలి**

శబరిమల ఆలయ పవిత్రతను కాపాడటం ప్రతి హిందువు బాధ్యత అని మాధవ్ అన్నారు. శబరిమల అంశంలో గతంలో చోటుచేసుకున్న పరిణామాలను ప్రస్తావిస్తూ ఆలయ ఆచారాలను కేవలం ప్రాథమిక హక్కుల కోణంలో కాకుండా ఆయా మత సంప్రదాయాల ప్రత్యేకతను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

"హిందూ మతం, దేవాలయాలపై ఒకవైపు అన్యమత శక్తులు, మరోవైపు నాస్తిక శక్తులు దాడి చేస్తున్నాయి. సమాజానికి తెలియకుండా సమాంతర వ్యవస్థలు నడుస్తున్నాయి. శబరిమలలోనూ ఇలాంటి వ్యవస్థలు పనిచేస్తున్నాయి" అని మాధవ్ వ్యాఖ్యానించారు. కమ్యూనిస్టు ప్రభుత్వాలు భారతీయ ధర్మాన్ని బలహీనపరిచే ప్రయత్నాలు చేస్తున్నాయని ఆరోపించారు.

శబరిమల ఆచార వ్యవహారాలపై న్యాయపోరాటం చేస్తున్న న్యాయవాదులకు, ధర్మ పరిరక్షణ కోసం కృషిచేస్తున్నవారికి మద్దతు ఇవ్వాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న న్యాయపోరాటంలో అవసరమైతే రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కూడా ఇంప్లీడ్ కావాలని అన్నారు.

**టీటీడీ తరహాలో వ్యవస్థ ఏర్పాటు**

శబరిమలలో టీటీడీ తరహాలో సమర్థమైన వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని మాధవ్ పేర్కొన్నారు. భక్తులకు తాగునీరు, అన్నదానం, వసతి, వైద్యం, రవాణా వంటి సౌకర్యాలు సమగ్రంగా అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

పంబ–నీలక్కల్–సన్నిధానం ప్రాంతాల్లో వసతి, వైద్య కేంద్రాలు, సమాచార కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. సత్రాల నిర్మాణానికి స్థలాలు కేటాయించేందుకు కేరళ ప్రభుత్వం ముందుకు రావాలని, అన్నదానం చేసేందుకు సిద్ధంగా ఉన్న సంస్థలకు అవకాశాలు కల్పించాలని అన్నారు.

అయ్యప్ప సీజన్‌లో అదనపు రైళ్లు నడిపేందుకు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడతామని, తెలుగు రాష్ట్రాల నుంచి శబరిమలకు ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేయాలని కోరుతామని తెలిపారు. తిరుగు ప్రయాణానికి కూడా తగిన రవాణా సౌకర్యాలు కల్పించాలని అన్నారు. బస్సు ఛార్జీలు పెంచకుండా నియంత్రించడంతో పాటు అవసరమైతే ప్రత్యేక రాయితీలు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరుతామని చెప్పారు.

**ఇప్పటి నుంచే కార్యాచరణ**

"నవంబరు 15 నుంచి జనవరి 20 వరకు అయ్యప్ప స్వాములు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి ఇప్పటి నుంచే ప్రయత్నిస్తాం. వచ్చే ఏడాదిలోపు సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కృషి చేస్తాం" అని మాధవ్ తెలిపారు.

గురుస్వాముల నుంచి నేరుగా సమస్యలను సేకరించి, వాటిని కేరళ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు.

**భక్తుల సమస్యలను హిందూ సమాజ సమస్యగా చూడాలి: భానుప్రకాశ్‌రెడ్డి**

బీజేపీ నేత భానుప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ భారతదేశంలో పుట్టడం అదృష్టమని, పూర్వీకులు అందించిన సంస్కృతి, సంప్రదాయాలు, దేవాలయాలు మన వారసత్వ సంపద అని అన్నారు. తాను పదిసార్లు శబరిమల వెళ్లానని, గత ఏడాది మూడు రోజుల పాటు స్వామివారి సన్నిధిలో ఉండి భక్తులు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా గమనించానని చెప్పారు.

శబరిమలలో తాగునీరు, అన్నప్రసాదం తదితర సౌకర్యాలను మరింత మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు. అయ్యప్ప భక్తుల సమస్యను కేవలం భక్తుల సమస్యగా కాకుండా హిందూ సమాజ సమస్యగా, సనాతన ధర్మానికి సంబంధించిన అంశంగా చూడాలని పిలుపునిచ్చారు.

టీటీడీ ప్రపంచంలోనే అతిపెద్ద హిందూ ధార్మిక సంస్థల్లో ఒకటని, భక్తుల కానుకలతో నడుస్తోందని చెప్పారు. టీటీడీ నిధులను ధార్మిక కార్యక్రమాలకు మాత్రమే వినియోగించాలన్నదే తన అభిప్రాయమన్నారు. "వెంకటేశ్వరస్వామి వడ్డీ కాసేవాడే కానీ వడ్డీ వ్యాపారి కాదు" అని గతంలో తాను చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. ఎక్కడైనా అన్యాయం జరిగితే "మనకెందుకులే" అనే ధోరణిని విడనాడి ప్రశ్నించే మనస్తత్వం రావాలని భానుప్రకాశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. శబరిమల భక్తుల సమస్యల పరిష్కారం కోసం పీవీఎన్ మాధవ్‌తో కలిసి ముందుండి పనిచేస్తానని హామీ ఇచ్చారు.

స్వామియే శరణం అయ్యప్ప అంటూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నేతలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పైలా ఆదిమోహన రెడ్డి గురు స్వామి మురుగన్ ,సంకా వాసు గురుస్వామి,మధు నంబూద్రి గురుస్వామి,చంటి గురుస్వామి,సోలే వెంకట కోటేశ్వరరావుగురుస్వామి,తోట శివశంకర్ గురుస్వామి,బెవరరాము గురుస్వామి,రాము గురుస్వామి, డుమ్ము గురుస్వామి,కన్నాగురుస్వామి,మేకల హనుమంతరావు గురుస్వామి,సిద్దు స్వామి తదితరులు తమ అభిప్రాయాలను వెల్లడించారుబిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, దుర్గమ్మ ఆలయట్రస్ట్ బోర్డు సభ్యులు అవ్వారు బుల్లెబ్బాయ తదితరులు పాల్గొన్నారు